వేట్లపాలెం హత్య కేసులో.. 7
12 మంది అరెస్ట్
- అరెస్టయిన వారిలో ముగ్గురు మహిళలు
- మారణాయుధాలు, ఆటో స్వాధీనం
- పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వెల్లడి

తీరంలో అలల ఉధృతి
- కొత్తపల్లి మండలం ఉప్పాడ, కోనపాపపేటల్లో పదిళ్లు నేలమట్టం
- పదేళ్లలో ఎన్నడూ చూడని కోత
- బిక్కుబిక్కుమంటున్న తీరప్రాంతగ్రామాలు
మెయిన్‌లో..


కొత్తపల్లి మండలం కోనపాపపేటలో కెరటాల ధాటికి కోతకు గురైన మత్స్యకారుల ఇళ్లు


కొత్తపల్లి మండలం మాయాపట్నంలో కూలిన ఇళ్లు

పిస్టల్‌తో బెదిరించి బంగారం చోరీ
- కాకినాడ నగరంలో తనిష్క్ జ్యూయలరీ షాపులో ఘటన
- నిందితుడిని వెంబడించి పట్టుకున్న ట్రాఫిక్ పోలీసులు
- డమ్మీ గన్‌గా గుర్తించిన పోలీసులు
- కాకినాడ వన్‌టౌన్‌లో కేసు
మెయిన్‌లో..

సమస్యల పరిష్కార దిశగా..


కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ

- జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు
- వెల్లడించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ
- పంట కాలువల్లో గుర్రపు డెక్క తొలగించేందుకు టెండర్లు
- నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలని..
- ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని ఆదేశాలు
- ఏలేరు ఆధునికీకరణ అంచనాల రివైజ్డ్‌పై పరిశీలన
- ఇరిగేషన్ కెనాల్స్‌లో షట్టర్ల మరమ్మతులకు ఆదేశాలు
- ఉప్పాడలో అన్న క్యాంటీన్ ఏర్పాటుపై పరిశీలన
- లారీ ఇసుక రూ.16వేలకు అందించే దిశగా చర్యలు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న పంటకాలువల్లో గుర్రపు డెక్కను తొలగించేందుకు తక్షణమే టెండర్లు పిలవాలని ఆదేశించామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా సమీక్ష కమిటీ (డీఆర్‌సీ) సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమం అనంతరం ఆయన విలేకర్ల మాట్లాడుతూ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు.

సంక్రాంతికల్లా గుంతల పూడ్చివేత

రబీ సీజన్ నుంచి జిల్లాలో రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించామన్నారు. ధాన్యం తడిచిపోకుండా ఉండేలా టార్పాలిన్ సబ్సిడీపై అందిస్తామన్నారు. జిల్లాలో అపరాలు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. జిల్లాలో ఇరిగేషన్ పరిధిలో ఉన్న షట్టర్లు మరమ్మతు గురయ్యాయన్నారు. వాటి మరమ్మతు చేసే దిశగా సమీక్షించామన్నారు. ఏలేరు ఆధునికీకరణకు రూ.848కోట్లతో ఫేజ్-1, ఫేజ్-2 అంచనాలు వేశారన్నారు. వాటిని ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం రివైజ్డ్ చేయాలని ఎమ్మెల్యేలు కోరగా పరిశీలిస్తున్నామన్నారు. ఉప్పాడలో ఒక అన్నాక్యాంటీన్ పెట్టాలని అడిగారని దానిపై పరిశీలిస్తామన్నారు. కాకినాడ జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్ల గుంతలను సంక్రాంతి కల్లా పూర్తి చేయాలని సూచించామన్నారు.

ఆ మున్సిపాల్టీలకు త్వరలో ఎన్నికలు

జిల్లాలో లారీ ఇసుక రూ.19వేల నుంచి రూ.22వేల వరకు ధర ఉందన్నారు. దాన్ని రూ.16వేలకు ఇవ్వాలని కోరగా ఆ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక ధర తగ్గించాలని బిల్డర్లు కూడా కోరారన్నారు. జిల్లాలో ఎన్నికలు జరగని మున్సిపాల్టీలకు వచ్చే జూన్, జూలై నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఘన, ద్రవ వ్యర్థాలతో జిల్లాలో వేస్ట్ ఎనర్జీ ప్లాంటు ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. అమృత్ ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలో ఉన్న నగరాలు, పట్టణాల్లో చక్కని తాగునీరు అందిస్తామన్నారు. ఈ పథకం ద్వారా చక్కటి డ్రైన్లు నిర్మించి అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, తుని ఎమ్మెల్యే యనమల దివ్య, పెద్దాపురం ఎమ్మెల్యే చిన్నరాజప్ప, కాకినాడ కమిషనర్ భావన, జిల్లా జేసీ రాహుల్‌మీనా పాల్గొన్నారు.

మంత్రికి ఘనంగా స్వాగతం

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): డీఆర్సీ సమావేశ నిమిత్తం కాకినాడ విచ్చేసిన కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, కాకినాడ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన ఘనంగా స్వాగతం పలికారు.


జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

మూడో వంతెన నిర్మాణం పూర్తి చేయాలి
-కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాగరమాల జాతీయ రహదారి మీదుగా వచ్చే వాహనాలవల్ల కాకినాడలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా ఉప్పుటేరు కాలువపై మూడో వంతెన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించాలి. రూ.116కోట్లతో మూడో వంతెన నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేయగా వైసీపీ ప్రభుత్వంలో పనులు మొదలుపెట్టలేదు. కాకినాడ నగరంలో చెత్త సమస్య పరిష్కారానికి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుకు డిటైల్డ్ రిపోర్టు తయారు చేయించాలి. నగర ప్రజల భవిష్యత్ తాగునీటి అవసరాలకు అమృత పథకం ద్వారా రూ. 117కోట్లతో అదనపు తాగునీటి ప్రాజెక్టుకు గతంలో తయారుచేసిన డీపీఆర్‌ను ఆమోదించాలి.

ఏలేశ్వరం- జె.అన్నవరం ఆర్‌అండ్‌బీ రహదారులు మొదలు పెట్టండి
-ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం, జె.అన్నవరం ఆర్‌అండ్‌బీ రహదారి చాలా అధ్వానంగా తయారైంది. రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయినా కాంట్రాక్టర్ ఈ రహదారి నిర్మాణ పనులు చేపట్టడం లేదు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని జలజీవన్ మిషన్ పథకంలో పైపులైన్‌ల ద్వారా నీటి సరఫరా పనులు కొన్నిచోట్ల మొదలు కాలేదు. దీనివల్ల తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యర్రవరం, ఏలేశ్వరం ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరించాల్సిన అవసరం ఉంది. ఈ పనులు సత్వరం అయ్యేటట్లు చర్యలు చేపట్టాలి.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి
-ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తునిలో ఏళ్ల తరబడి తిష్టవేసిన ప్రధాన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి. కొండవారిపేట, తునికి మధ్యగల రైల్వే అండర్‌పాస్ ర్మాణంపై రైల్వే అధికారులతో మాట్లాడి అండర్‌పాస్ నిర్మాణానికి చొరవ చూపాలి. తునిలో పలు వార్డుల్లో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణాలకు రూ.15కోట్లు అవసరం. నిధులు మంజూరు చేసి పట్టణ అభివృద్ధికి సహకరించాలి.


తుని సమస్యలపై మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య

పంట కాలువల ఆధునికీకరణ కోసం అంచనాలు వేసి టెండర్లు పిలవాలి
-కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 18(ఆంధ్ర జ్యోతి): రబీ సాగు ముగిసేలోపు పంట కాలువలు, డ్రైనేజీల ఆధునీకరణ కోసం తక్షణమే ఎస్టిమేట్లు తయారు చేసి టెండర్లు ఆహ్వానించేలా చర్యలు తీసుకోవాలి. డిప్యూటీ సీఎం పవన్ రైతులకు హామీ ఇచ్చిన కొంగోడు బ్రిడ్జి అసంపూర్తి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి. కరప మండలంలోని ఎత్తిపోతల పథకాలు పూర్తి చేయాలి. పంచాయతీ, ఆర్‌అండ్‌బీ స్టాండర్డ్స్ మేరకు 3.66మీటరు(12) అడుగులకు పెంచినిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. నియోజకవర్గ పరిధిలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, పాత పైపులైన్లు మార్పించి, కొత్త పైపులైన్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలి.

ఉప్పుటేరుపై మూడో బ్రిడ్జి

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ఉప్పుటేరుపై మూడో బ్రిడ్జిని బైపాస్ రోడ్డుగా నిర్మించాలని డీఆర్‌సీ సమావేశంలో నిర్ణయించారు. రాజానగరం కాకినాడ మధ్య వేస్ట్ ఎనర్జీ పాంట్లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా 50శాతం రైతులు, 50శాతం ఉపాధి హామీ పథకం కింద చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతిపాదించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతామన్నారు. ఇసుక లభ్యత గురించి సమీక్షలో ఇసుక ధర తగ్గించేందుకు కాకినాడ జిల్లాకు దూరంగా ఉన్న వేమగిరి, తీపర్రు రీచ్‌లు నుంచి కాకుండా దగ్గర్లోని కోటిపల్లి, కపిలేశ్వరపురం రీచ్‌లనుంచి ఇసుక కేటాయింపునకు ప్రజాప్రతినిధులు కోరగా దీనిపై వారంరోజుల్లో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, బొర్రా గోపిమూర్తి, టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్, కుడా చైర్మన్ తుమ్మల స్వామి, మాజీ ఎమ్మెల్యే వర్మ పాల్గొన్నారు.

ఇసుక, గ్రావెల్ సమస్యలు తీర్చండి

జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేల విన్నపాలు

సామర్లకోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక, గ్రావెల్ మట్టి పేదలకు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటే పేదవర్గాల నుంచి ప్రభుత్వానికి ఆదరాభిమానాలు మెండుగా లభిస్తాయని, ఈదిశలో కృషిచేయాలని జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు మున్సిపల్ మంత్రి పొంగూరి నారాయణను ముక్తకంఠంతో కోరారు. టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్వగృహమైన సామర్లకోట మండలం అచ్చంపేటలో ఆయన ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి నారాయణ దృష్టికి ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, పిఠాపురం ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ, కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ పలు సమస్యలు తెలిపారు. ఇదే సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, కౌడా చైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, టిడ్కో రాష్ట్ర చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పేదలు తమ స్థలాలు పల్లంలో ఉన్నందున మెరక చేసుకునేందుకు సమీపంలో లభించే గ్రావెల్‌మట్టి తరలించుకునేందుకు ఆంక్షలను సడలించాలని కోరారు. టిడ్కో ప్లాట్‌లను త్వరితగతిన అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి నారాయణను జిల్లాలోని ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జిలతో మాట్లాడుతూ డిస్ట్రిబ్యూటరీ కమిటీలు కోపరేటివ్ సొసైటీలకు చైర్మన్ల ఎంపిక విషయంలో కూటమి పార్టీల నాయకులు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు.


ఎమ్మెల్యే చినరాజప్ప ఇంట్లో మంత్రితో సమావేశమైన ఎమ్మెల్యేలు, నాయకులు

2 నుంచి మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణా తరగతులు

కాకినాడ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో మెగా డీఎస్సీకి హాజరయ్యే అభ్యర్థులకు జనవరి 2నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి ఎంఎస్ రావు తెలిపారు. శిక్షణ తరగతులతోపాటు ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన ప్రాక్టీసు టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తామని, స్టైఫండ్, బుక్స్ అలవెన్స్ లాంటి సౌకర్యాలు కల్పించనున్నామని తెలిపారు. మెగా డీఎస్సీ-2024 కు పోటీ పరీక్షకు సిద్ధపడుతున్న అభ్యర్థులు బయోడేటాతోపాటు అర్హతా పత్రాలతో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారతాధికారి కాకినాడ వారి కార్యాలయానికి ఈనెల 28లోపు దరఖాస్తుచేసుకోవాలని సూచించారు. వివరాలకు 08842379216 నెంబరులో సంప్రదించాలన్నారు.

ఏపీపీఎస్సీ డిపార్టుమెంటు పరీక్షలు ప్రారంభం

- మొదటిరోజు పరీక్షలకు 250 మంది అభ్యర్థులు హాజరు

కాకినాడ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ద్వారా వివిధ ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ నెల 23 వరకూ నిర్వహించే డిపార్టుమెంటు పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెంలోని సాఫ్ట్ టెక్నాలజీ కేంద్రంలో రెండు సెషన్‌ల్లో నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ జరిగిన పరీక్షకు మొత్తం 145మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 126 మంది అభ్యర్థులు హాజరుకాగా 19 మంది పరీక్ష రాయలేదు. మధ్యాహ్నం 3నుంచి 5గంటల వరకూ జరిగిన పరీక్షకు 145 మొత్తం హాజరుకావాల్సి ఉండగా 124 మంది అభ్యర్థులు హాజరుకాగా 21 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ కేంద్ర ప్రతినిధి తెలిపారు. ఈ పరీక్షలు గురువారం జరుగుతాయన్నారు.

పాలన.. గాడిన పడేనా? 7
- అన్నవరంలో ఈవోలు మారినా పాలన అస్తవ్యస్తం
- మార్పులకు శ్రీకారం చుట్టిన నూతన ఈవో సుబ్బారావు

వెన్నాడుతున్న ముసురు


గొల్లప్రోలులో ధాన్యాన్ని బస్తాల్లోకి నింపి తరలించేందుకు సిద్ధం చేసిన రైతులు

- రైతులకు తప్పని పాట్లు
- ధాన్యం తరలింపునకు అగచాట్లు

గొల్లప్రోలు/పిఠాపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులను ముసురు వాతావరణం వెన్నాడుతోంది. వర్షపు చినుకులు పడుతుండటం, మధ్యలో ఎండవచ్చినా ఆకాశమంతా మేఘావృతమై ఉండడంతో రైతులు కలవరానికి గురవుతున్నారు. ఆరబెట్టిన ధాన్యం రాశులను హడావుడిగా మిల్లులకు తరలించేందుకు పాట్లు పడుతున్నారు.

హడావుడిగా ఒబ్బిడి

ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలోని గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో వరి కోతలు, మాసూళ్లు పూర్తయిన ప్రాంతాల్లో ధాన్యం రాశులను కళ్లాలు, పంటపొలాలు, రహదారుల వెంబడి ఆరబెట్టారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తేమశాతం తగ్గేలా ధాన్యం రాశులను ఆరబెట్టినా ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వాటిని హడావుడిగా ఒబ్బిడి చేసుకుంటున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం తెల్లవారుజామున వర్షం పడగా రోజంతా పలుమార్లు చినుకులు పడ్డాయి. మధ్యలో ఎండకాసినా స్వల్ప సమయమే ఉంది. ముసురు వాతావరణం వెన్నాడుతుండడంతో ఏ క్షణమైనా భారీ వర్షం పడితే ధాన్యం రాశులు తడిచిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనితో మధ్యాహ్నం నుంచి కళ్లాలు, రహదారులు వెంబడి ఆరబెట్టిన ధాన్యం రాశులను బస్తాల్లోకి పట్టి మిల్లులకు, లేకుంటే ఇళ్ల వద్ద గోదాములకు రైతులు తరలిస్తున్నారు. తరలింపునకు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, లారీలు సకాలంలో లభించకపోవడంతో రైతులు హైరానా పడుతున్నారు. ధాన్యం బస్తాలను కళ్లాల్లోనే కొన్నిచోట్ల ఉంచేశారు. రాత్రికి తరలించడం సాధ్యం కాకుంటే ఉదయమే తరలించాలని భావిస్తున్నారు. ఈలోగా వర్షం కురిసినా తడవకుండా, నీరు నిలవకుండా ఉండేందుకు రక్షణ ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

పుష్కరాలు 2027కు సన్నద్ధం కావాలి

- రెండేళ్లలో పనులు పూర్తి చేయాలి
- రాజమండ్రి-కొవ్వూరు కలిపి రూ.1868.70కోట్ల ప్రతిపాదనలు
- ఘాట్లు, రహదారులు, డ్రైనేజీ, తాగు నీటి సమస్యలు పరిష్కారం కావాలి
- అధికారుల సమీక్షలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు 2027కు అధికారులంతా సన్నద్ధం కావాలని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం రాజమండ్రి నగరపాలక సంస్థ, కొవ్వూరు డివిజన్ అధికారులతో మంత్రి నారాయణ, కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేక అధికారి పి.ప్రశాంతి, ఎమెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ముప్పిడి వెంకట్రావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, కమిషనర్ కేతన్‌గార్గ్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితలతో పుష్కరాల 2027పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత కమిషనర్ కేతన్‌గార్గ్ పుష్కరాలకు సంబంధించి రాజమహేంద్రవరంలో చేపట్టే ఘాట్ల నిర్మాణ ప్రతిపాదనలు, రహదారుల ప్రతిపాదనలు, డ్రైనేజీ నిర్మాణాలు, తాగునీటి సదుపాయాలు, రవాణా సదుపాయాలు, వసతి సదుపాయాలు, క్రౌడ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు సంబంధించి రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలకు, ఘాట్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. నాలుగు కొత్త ఘాట్ల నిర్మాణాలు చేపడతామని మంత్రి దృష్టికి తెచ్చారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత కూడా కొవ్వూరు, నిడదవోలు, విజ్జేశ్వరం, కుమారదేవం, ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, కొవ్వూరు గోష్పాదాల రేవు అభివృద్ధి, బ్యూటిఫికేషన్, గోదావరి సురక్షిత తాగునీరు అందించే ప్రతిపాదనలు, రహదారుల విస్తరణ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వీటన్నింటిపైన కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలతో మంత్రి చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా గతంలో ప్రతిపాదించిన పనులను ఫిబ్రవరి నెలలో తిరిగి ప్రారంభించనున్నట్టు చెప్పారు. 70శాతం ఏడీబీ రుణం, మిగిలిన 30 శాతం ప్రభుత్వ గ్రాంటు విడుదల చేయడం జరుగుతుందన్నారు.

పుష్కరాల నాటికి అభివృద్ధి

తాగునీటి సమస్యను అధిగమించేందుకు అమృత్ పథకం 2.0 పథకం కింద రూ.8400 కోట్లు కేంద్రం గ్రాంటు ఉందని, ఇందులో కేంద్రం 36.70శాతం గ్రాంటు ఇస్తున్నట్టు చెప్పారు. మిగిలిన నిధులను స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం నిధులు అనుసంధానం చేయనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల పనులు రానున్న రెండేళ్లలో పూర్తిచేసి గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అదనపు పన్నులు వేయకుండా అసెస్మెంట్‌లు చేస్తామని, దీని ద్వారా నగరంలో రూ.79 కోట్ల బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకుంటామన్నారు. అనధికార కట్టడాలకు సంబంధించి సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. 2027 గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో 1587.80 కోట్లు, కొవ్వూరు డివిజన్‌లో రూ.280.90 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మొత్తం రూ1868.70 కోట్లు ప్రతిపాదనలు ఉన్నాయని అన్నింటిపైన సీఎం చంద్రబాబుతో చర్చిస్తానని, మరొక 15 రోజుల్లో మళ్లీ వచ్చి అన్ని ప్రభుత్వ శాఖలతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. పుష్కరాలకు మనకు సమయం ఉంది కాబట్టి అన్ని పనులు ఇప్పటి నుంచే మొదలు పెట్టుకోవాలన్నారు. రాజమహేంద్రవరం సిటీకి సంబంధించి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్‌కు సంబంధించి ఎమ్మెల్యే గోరంట్ల, కొవ్వూరుకు సబంధించి ముప్పిడి వెంకట్రావు పుష్కరాల పనులు, సమస్యలపై మంత్రి నారాయణ, కలెక్టర్ ప్రశాంతిలతో చర్చించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ ఎస్ఈ జి.పాండురంగారావు, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, రుడా అధికారులు మూర్తి, టౌన్ ప్లానింగ్ అధికారి కోటయ్య, నగర పాలక సంస్థ అధికారులు మాలిక్, సిహెచ్ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాసం వచ్చిందంటే చాలు సూర్యోదయానికి ముందే హరిలో రంగ హరి... అంటూ చేతిలో చిడతలు, తంబుర వాయిస్తూ తలపై అక్షయపాత్రతో ప్రత్యక్షమవుతారు హరిదాసులు. సంక్రాంతి నెలలో మనకు కనిపించే గొప్ప సంప్రదాయాల్లో ఒకటి హరిదాసుగానం. పూర్వం పల్లె, పట్టణం తేడాలేకుండా తెల్లవారుజామునే ముంగిట ముగ్గు లేసే సమయానికి పురవీధుల్లో కీర్తనలను ఆలపిస్తూ అలరించేవారు. భక్తిగీతాలను అలా పాడుకుంటూ సాగిపోవడం... ఎవరైనా ధన, ధాన్యాలను స్వయంపాకంగా ఇస్తే స్వీకరించడం వారి సంప్రదాయం.... హరిదాసుపై ప్రత్యేక కథనం...





పల్లెలు, పట్టణాల్లో మొదలైన హరిదాసుల సందడి

సంక్రాంతికి వచ్చేశాం..

(ఆంధ్రజ్యోతి, తుని రూరల్/అంబాజీపేట)

హరిదాసు అంటే..

హరిదాసు అనగా పరమాత్మతో సమానం. మనుషులు ఇచ్చే దానధర్మాలు అందుకుని వారికి ఆయురారోగ్యాలు, భోగ భాగ్యాలు కలగాలని దీవించేవారే హరిదాసులు. నెలరోజులపాటు హరినామాన్ని గానం చేసినందుకు చివరి రోజున ఇచ్చే ధన, ధాన్యాలను, వస్త్ర దానాలను స్వీకరిస్తారు. వీరి వస్త్రధారణ ప్రత్యేకంగా ఉంటుంది. పట్టు ధోవతి కట్టి, పట్టు కండువా నడుమ చుట్టి మెడలో ఒక పూల హారం ధరించి చక్కగా తిలకం దిద్దుకుంటారు. సూర్యభగవానుడు ప్రసాదించిన అక్షయ పాత్రగా శిరస్సుపై పంచలోహ పాత్ర ధరిస్తారు. తెల్లవారకముందే ఈ అలంకరణ పూర్తి చేస్తారు. గోదాదేవిని స్మరించి తిరుప్పావై పఠించి విధుల్లోకి వెళ్తారు. తిరిగి ఇంటికి వెళ్లే వరకు హరినామ సంకీర్తన తప్ప ఏ ఇతర విషయాలూ మాట్లాడరు. తలపై అక్షయ పాత్రను కిందకు దించరు. ఇల్లు చేరిన తర్వాత ఆ ఇంటి ఇల్లాలు హరిదాసు పాదాలను కడిగి అక్షయ పాత్రను దించుతుంది. అలా ధనుర్మాసం అంతా ఎంతో నిష్టగా ఉంటారు హరిదాసులు.



శ్రీమహావిష్ణువుకు ప్రతిరూపాలుగా భావించే హరిదాసులు ధనుర్మాసంలో తెలుగు లోగిళ్లలో సందడి చేస్తారు. వీరు ధనుర్మాస అతిథులుగా పండగకు నెలరోజులు ముందు నెల గంట పట్టాక ధనుర్మాస ప్రవేశంతోనే ప్రజలకు వీరి దర్శనం కలుగుతుంది. తంబూర మీటుతూ, చితడలు వాయిస్తూ రామనామ సంకీర్తనలతో వినసొంపైన బాణీలతో అలరిస్తారు. హరిదాసులు అంటే పెద్దలకు భక్తిభావం, పిల్లలకు మాత్రం వారిని చూడడంలో సరదా ఉంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈనెలరోజులపాటు పొద్దున్నే వీరి పిలుపుతోనే పల్లెలు నిద్రలేస్తాయి.

పద్ధతి ఎలా వచ్చింది...

శ్రీరాముడి రాజ్యంలో చింతలు లేవు. కరువు కాటకాలు రావు. దానధర్మాలు చేద్దామన్నా పుచ్చుకునేవారే కరువయ్యారని ప్రజలు ధర్మదేవతను ఆడిపోసుకునేవారట. అది విన్న వేగులు రాముడితో చెప్పగా వారి దానధర్మాలను పుచ్చుకునేందుకు హరినామాన్ని గానం చేసే గాయకులను రాజ్యంలో తిరుగాడేలా చేశారని, వారే నేడు కన్పించే హరిదాసులని చెబుతుంటారు.

హరిదాసుల రామగానం..

ఏడాది అంతా వేర్వేరు పనుల్లో నిమగ్నమయ్యే హరిదాసులు ధనుర్మాసంలో మాత్రం తప్పకుండా రామగానం చేస్తారు. సొంత ఊళ్ల నుంచి వేరే ఊళ్లకు వెళ్తారు. గ్రామవీధుల్లో భజనలు చేస్తారు. ప్రతిఇంటి ముందు కూర్చుని లేవడం కష్టమైనా భక్తిభావంతో అదంతా మర్చిపోతారు. వంశపారంపర్యంగా అనేకమంది దశాబ్దాలుగా రామనామ స్మరణ చేస్తున్నారు. సంక్రాంతి పండుగ ముగిసిన తర్వాత తమ సొంత ఊళ్లకు వెళ్లే హరిదాసులు మిగతా రోజులు పొలం పనులు, కూలి పనులతో జీవనం సాగిస్తారు.

సంప్రదాయాన్ని కొనసాగించేందుకే...


శ్రీరామావతారంగా భావించి ఈ దీక్షను స్వీకరిస్తాం. ఉదయం 4 గంటల నుంచే పొగమంచులో ప్రయాణం ప్రారంభిస్తాం. చివరి రోజు స్వయంపాకంలో వందలు, వేల రూపాయలు ఇచ్చేవారు. ఇప్పుడు ఆదరణ బాగా తగ్గిపోయింది. దానం ఇచ్చే వారు తగ్గిపోయారు. ఏటా భద్రచలం వెళ్లి శ్రీరాముడికి రూ.2వేలు సమర్పించుకుంటా. భావితరాల వారు ఈ కళలోకి రావడానికి ఆసక్తి చూపడం లేదు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలన్నదే మా తాపత్రయం. -సత్యనారాయణ, హరిదాసు, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం

పాపాలు తొలగుతాయని..

సంక్రాంతికి ముందు అంటే ధనుర్మాసంలో హరిదాసులు వీధుల్లో కనువిందు చేస్తూ శ్రీమద్రామణ రమణ.. గోవిందో హరి అంటూ ఇంటి ముందు ముగ్గుల చుట్టూ ఒకసారి తిరుగుతారు. హరిదాసును వేకువజామునే దర్శిస్తే పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఉట్టిచేతులతో ఆయన్ను పంపరు. అందుకే తుంబుర గానం వినిపించగానే గృహిణులు స్వయం పాకాలతో సిద్ధంగా ఉంటారు.

హైటెక్ హరిదాసులు

ధనుర్మాసం ప్రారంభమైన నెలరోజులపాటు హరిదాసులు వేకువజామునే గ్రామాల్లో ఇంటింటికీ నడుచుకుని తిరిగి సందడి చేసేవారు. ప్రస్తుత ఆధునిక కాలంలో అప్పటి హరిదాసులకు వయస్సు పెరగడంతోపాటు కీళ్లనొప్పులు తదితర రోగాల బారిన పడడంతో మోటార్‌సైకిల్‌పై ఇంటింటికీ వచ్చి బియ్యాన్ని స్వీకరిస్తున్నారు. ఆ మోటార్‌సైకిల్‌కు అక్షయపాత్రను ప్రత్యేకంగా అలకరించి మైక్‌లో హరిరామ సంకీర్తనను రికార్డింగ్ చేయించి ఇంటింటికీ వెళ్తుండగా భక్తులు కృష్ణార్పణం అంటూ అక్షయపాత్రలో బియ్యాన్ని పోస్తున్నారు. సంప్రదాయాలను పరిరక్షించడంలో భాగంగా నూటికి పది మంది హరిదాసులు కాలినడకనే నెత్తిపై అక్షయపాత్ర ధరించి ఇంటింటికీ తిరుగుతున్నారు.



శీతాకాలంలో జరభద్రం

- వ్యాధులు విజృంభించే సీజన్
- జాగ్రత్తలు తీసుకోకపోతే ముప్పు
- ఉన్ని దుస్తులు తప్పనిసరి
- గుండె, శ్వాస, రక్తపోటు రోగులు జాగ్రత్త
- ఎండవచ్చిన తర్వాతే వ్యాయామం చేయాలంటున్న వైద్యనిపుణులు

కోటనందూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో చలిప్రభావం రోజురోజుకూ పెరుగుతోంది. గజగజ వణికిస్తోంది. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో ఉదయం 10గంటలవరకు ఎండరావడం లేదు. రోజంతా చలిగా ఉంటోంది. చలి తీవ్రతకు చిన్నారుల నుంచి వృద్ధులు, గుండె, మధుమేహం, రక్తపోటు ఉన్నవారు ఈ చలికాలంలో అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. దీంతో ఈ కాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఎదురయ్యే సమస్యలు..

చలికాలంలో ప్రధానంగా జలుబు, గొంతు నొప్పులతో చిన్నారులు, వృద్ధులు సమస్యలతో బాధపడుతుంటారు. వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. పెదవులు పగిలి రక్తస్రావం జరుగుతుంది. చర్మం పొడిబారుతుంది. దీని వల్ల దురద ఎక్కువగా ఉంటుంది. 50ఏళ్లు పైబడినవారిలో కీళ్లనొప్పులు ఎక్కువగా ఉంటాయి. చల్ల నీళ్లతో స్నానాలు చేయడం, మంచులో ప్రయాణం చేయడం వల్ల పంటి సమస్యలతోపాటు, అస్తమా రోగులు శ్వాస తీసుకోవడం, జలుబు వంటివి తరచూ వస్తాయి. గుండె, రక్తపోటు ఉన్నవారు కూడా తీవ్ర ఇబ్బందులు పడతారని అంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

శీతాకాలం మంచులో తడవడం, చల్ల గాల్లో తిరగడం చేయకూడదు. చిన్నపిల్లలను చలిగాలుల్లో ఆడుకోనివ్వరాదు. మంకీ టోపీలు, గ్లౌజులు, మాస్కులు వంటివి ధరించాలి. ఒకే చోట ఎక్కువ సమయం కూర్చోని ఉండకుండా చలి,మంచు తగలకుండా ఇంట్లోనే నడవాలి. జలుబు ఎక్కువగా ఉంటే ఆవిరి పట్టాలి. గొంతు సమస్య ఉన్నవారు ఒక గ్లాసు వేడినీటిలో చెంచా ఉప్పు వేసుకుని పుక్కిలించాలి. ఇన్‌ఫెక్షన్ వ్యాప్తి చెందకుండా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. చేతి రుమాలను తరుచూ మారుస్తూ ఉండాలి. చిన్నపిల్లలకు ముక్కు మూసుకుపోయి శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిగా ఉంటే నాసికా రంధ్రాల్లో నాజల్ డ్రాప్స్ గానీ, ఉప్పు నీటి చుక్కలు గానీ వేయాలి. వేడి నీళ్లు తాగాలి. నిల్వ పదార్థాలను తినరాదు. ఆహారం వేడిగా ఉన్నప్పుడే తినాలి. పెదవులు పగిలిపోకుండా గ్లిజరిన్ కలిగిన లిప్ బామ్‌లను గానీ వెన్న, కొబ్బరి నూనె రాసుకోవాలి. రాత్రి సమయంలో రాసుకుంటే మంచిది. వాకింగ్ చేసేవారు విధిగా గ్లౌజులు, మాస్కులు, ఉన్ని దుస్తులు వేసుకోవాలి. అస్తమా ఉన్నవారు చల్లగాలులకు పూర్తిగా దూరంగా ఉండాలి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఉన్ని దుస్తులు ధరించి ప్రయాణం చేయాలి. అన్ని జాగ్రత్తలు తీసుకుంటేనే ఈ శీతాకాలంలో ఇబ్బందులనుంచి గట్టెక్కగలమని వైద్య నిపుణులు చెప్తున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



శీతాకాలంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. చిన్నపిల్లల్లో అస్తమా ఉంటే ఇబ్బందులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏడాదిలోపు శిశువులకు ఉదయం పూట స్నానం చేయించడంవల్ల ముక్కు బ్లాక్ అయి ఇబ్బందులు పడొచ్చు. ఎండ వచ్చిన తర్వాత చర్యలు చేపట్టాలి. గుండె, చక్కెరవ్యాధి, అస్తమా ఉన్నవారు తగుజాగ్రత్తలు తీసుకోవాలి.

డాక్టర్ రెడ్డి త్రినాథ్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, తుని ఏరియా ఆస్పత్రి

గర్భిణిలు జాగ్రత్తగా ఉండాలి



శీతాకాలంలో గర్భిణులు, బాలింతలు జాగ్రత్తగా ఉండాలి. ఉదయంపూట ఎండలో ఉండాలి. గదుల్లో వెచ్చదనం ఉండేలా చూసుకోవాలి. ఉన్నిదుస్తులతోపాటు ముఖానికి గాలి తగలకుండా చూసుకోవాలి.

అలమండ ప్రసన్న, గైనకాలజిస్టు



తుని-నర్సీపట్నం రహదారిపై మంచు కురుస్తున్న దృశ్యం



పాపికొండలు పర్యాటకంలో

నిబంధనలకు తూట్లు

సమయపాలన పాటించని బోట్ల యజమానులు

దేవీపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు అందాలను చూడ్డానికి ఎప్పుడెళ్దామా అని ప్రకృతి ప్రేమికులంతా ఎదురు చూస్తుంటారు. గోదావరిలో బోటు షికారు చేస్తూ కొండలు, అడవులను చూస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయాణం చేయడం మరపురాని అనుభూతి. అయితే నిబంధనలను పట్టించుకోకపోతే ఆనందం మాట పక్కన పెడితే ప్రమాదం కొనితెచ్చుకున్నట్లు అవుతుంది. ప్రస్తుతం పాపికొండలు విహారయాత్రకు వెళ్లే బోట్ల యజమానులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా గోదావరి నదిలో పర్యాటకానికి వెళ్లే బోట్ల రాకపోకల విషయంలో పర్యాటకుల భద్రత దృష్ట్యా నిబంధనలు కఠినతరం చేశారు. పాపికొండలు పర్యాటకానికి వెళ్లే బోటు విధిగా ఉదయం 8.40 గంటలకు బోటు పాయింట్ నుంచి బయల్దేరి సాయంత్రం ఐదు గంటలలోపు తిరిగి గమ్యానికి చేరాలనే నిబంధన ఉంది. మంగళవారం బోటు పాయింటు నుంచి ఉదయం రెండు బోట్లు బయల్దేరి వెళ్లాయి. తెలంగాణ నుంచి సుమారు 60 మంది నిర్దిష్ట సమయం ముగిశాక రావడంతో అనుమతి కోసం వేచి చూశారు. ఎట్టకేలకు ఉదయం 11.30 గంటలకు బోటు పాపికొండలు బయలుదేరింది. సాధారణంగా ఉదయం ఏడు గంటలకు వెళ్లిన బోటు సాయంత్రం రావడానికి 6 లేదా 7 అవుతుంది. అలాంటిది అధికారులు సూచించిన నిర్దిష్ట సమయంలో బోటు వెళ్లకపోవడం, ఆలస్యంగా వెళ్లడాన్ని పలువురు విమర్శించారు. పర్యాటక బోట్లు రాకపోకలు పర్యవేక్షించే పోశమ్మగండి చెక్‌పోస్టు వద్ద నిబంధనలకు విరుద్ధంగా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పాపికొండలు విహార యాత్రలో బోట్ల యజమానులు నిబంధనలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వాణిజ్య పంటలకు నిలయంగా.. కాట్రావులపల్లి



జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో మిరప పంట



కాట్రావులపల్లిలో బంతి తోటలో పూలు కోస్తున్న దృశ్యం

- నల్లరేగడి నేలలు అధికం
- మొక్కజొన్న, పచ్చిమిర్చి, శనగలు, కాయగూర పంటల పెంపకం
- సీజనల్‌గా పూలతోటలు, కొత్తిమీర

జగ్గంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటల్లో కాట్రావులపల్లి ముందంజలో ఉంది. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని ఈగ్రామంలో రైతులు అధికసంఖ్యలో ఉంటారు. వీరంతా భూములను కౌలుకు తీసుకుని పంటలు పండించడంలో దిట్ట. ఈ ప్రాంతంలో నల్లరేగడి నేలలు అధికంగా ఉండడంతో మొక్కజొన్న, స్వీట్‌కార్న్‌లతోపాటు ఎండుమిర్చి, పచ్చిమిర్చి, శనగలు, మినుములు, కాయగూర పంటలు, సీజనల్‌గా పూల తోటలు, కొత్తిమీర... ఇలా అన్ని రకాలూ పండిస్తున్నారు. వాటిని మార్కెట్లో అమ్మి వ్యవసాయానికి కావాల్సిన పెట్టుబడులను తెచ్చుకోవడంతోపాటు జీవనభృతి పెంచుకోవడంలో ఇక్కడి రైతులు ముందుంటున్నారు. స్వీట్‌కార్న్ సాగులో వీరికి వీరే సాటి. మూడు నెలల్లో పంటలు చేతికొచ్చేలా వ్యవసాయం చేయడంలో ఆరితేరారు. జగ్గంపేట-కాకినాడ ప్రధాన రహదారికి ఇరువైపులా నిత్యం ఏదో ఒక పంట ఎగుమతి అవుతూనే ఉంటుంది. ప్రస్తుతం ఆకుకూరలు, కొత్తి మీర, పూల తోటలు వేసి రైతులు లాభాల బాటలో వున్నారు. కొత్తమీర పంటకు ఎకరాకు రూ.10వేలు పెట్టుబడి పెడితే రూ.20వేలు ఆదాయం వస్తుందని, రెండు నెలల కాలంలో పంట చేతికి అందుతుందని రైతులు చెప్పారు.

ఆలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా

ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

వివాదాలుంటే రెవెన్యూ సదస్సుల్లో సరి చేసుకోవాలి: వీడియో కాన్ఫరెన్స్‌లో దేవదాయ శాఖ కమిషనరు సత్యనారాయణ

అన్నవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని దేవదాయ శాఖ కమిషనరు ఎస్.సత్యనారాయణ సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన అన్నవరం దేవస్థానం ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానంగా భూములపై చర్చించారు. దేవాలయాల భూముల లీజు విషయంలో అశ్రద్ధ వహించొద్దని, ఆలయ భూముల రికార్డుల విషయంలో తప్పొప్పులు ఉంటే ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని సరిచేసుకోవాలన్నారు. అన్నవరం దేవస్థానం భూములు ఎన్ని ఉన్నాయని ప్రశ్నించారు. సత్యగిరి కొండలు 466.34 ఎకరాలు, చెందుర్తిలో 150.50 ఎకరాల కొండ, 66.64 ఎకరాల్లో మారేడువనం పెంపకం, వివిధ ప్రాంతాల్లో లీజుల పరిధిలో 71.84 ఎకరాలు, ఆలయ పరిధిలో ఉద్యానవనాలు, ఇతర నిర్మాణాలు 36.94 ఎకరాలు... దేవస్థానం పరిధిలో మొత్తం సుమారు 800 ఎకరాలున్నాయని, ఇందులో 4.75 ఎకరాలు ఆక్రమణలో ఉన్నాయని ఈవో వివరించారు. అనంతరం సిబ్బందికి కమిషనరు పలు సూచనలు చేశారు. ఆలయ పరిసరాలు, సత్రం గదుల వద్ద పారిశుధ్యం మెరుగ్గా ఉంచాలని, సిబ్బంది విధిగా డ్రెస్‌కోడ్ పాటించాలని, వ్రతమండపాల్లో పురోహితులు దానాల పేరుతో డబ్బులు వసూలు చేయకుండా ఆడియో రికార్డు, ఫ్లెక్సీల ద్వారా భక్తులకు అవగాహన కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయం నుంచి అదనపు కమిషనరు చంద్రకుమార్, రీజనల్ జాయింట్ కమిషనర్లు ఆజాద్, భ్రమరాంబ, అన్నవరం దేవస్థానం నుంచి ఉప కమిషనరు చంద్రశేఖర్, సహాయ కమిషనరు సీహెచ్ రామ్మోహనరావు, పీఆర్వో కొండలరావు, ఈఈలు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సకాలంలో తెరవని కేశఖండనశాల

బుకింగ్ కౌంటర్

తాళాలు పగులకొట్టించిన అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు

గుమస్తా సస్పెన్షన్.. కాంట్రాక్ట్ ఉద్యోగి విధుల నుంచి తాత్కాలికంగా తొలగింపు

అన్నవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు కొరడా ఝుళిపిస్తున్నారు. బుధవారం ఉదయం ఆరు గంటలు దాటినా కేశఖండనశాల బుకింగ్ కౌంటర్ తెరవకపోవడంతో భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. ఈ సమయంలో ఆకస్మిక తనిఖీ చేసిన ఈవో వెంటనే బుకింగ్ కౌంటర్ తాళాలు పగులగొట్టించి తెరిపించారు. మరొకరిని నియమించి ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు. సంబంధిత అధికారులకు సమాచారమివ్వకపోవడంతో కేశఖండనశాల గుమస్తా యడ్ల బుల్లబ్బాయిని సస్పెండ్ చేశారు. సకాలంలో రాని కాంట్రాక్ట్ ఉద్యోగిని ఆర్.మల్లేశ్వరిని విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ ఈవో ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించి భక్తులకు అసౌకర్యం కల్పిస్తే ఎంతటివారైనా చర్యలకు వెనుకాడబోనని సుబ్బారావు పేర్కొన్నారు.

దుర్గామాత దర్శనానికి పాదయాత్రగా...


రాజానగరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం నర్సాపురానికి చెందిన 11 మంది భవానీ మాలధారణ దీక్షతో విజయవాడ దుర్గామాత దర్శనం కోసం ఈ నెల 13న కాలినడకన పయనమయ్యారు. మార్గమధ్యంలో బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం తూర్పుగోనగూడెం చేరారు. విజయవాడ సుమారు 400 కిలోమీటర్లు దూరం ఉంటుందని, భక్తులు ఎవరైనా భిక్ష ఏర్పాటు చేస్తే స్వీకరిస్తున్నామని చెప్పారు. భవానీ మాలలు ధరించడం ఇది 11వ పర్యాయమని, విజయవాడకు తొలిసారిగా పాదయాత్ర చేస్తున్నామన్నారు. ఇంద్రకీలాద్రిపై ఈ నెల 21వ తేదీన చండీ హోమం ప్రారంభం అవుతుందని, 22 నాటికి తాము విజయవాడ చేరుకుంటామని భవానీ మాలధారులు చెప్పారు.



పాదయాత్రగా తూర్పుగోనగూడెం చేరుకున్న భవానీ భక్తులు

పాలన.. గాడినపడేనా?

- అన్నవరం దేవస్థానంలో ఈవోలు మారినా పాలన అస్తవ్యస్తం
- ఆదాయం వస్తున్నా అనవసర వ్యయాలతో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం
- మార్పులకు శ్రీకారం చుట్టిన నూతన ఈవో సుబ్బారావు


అన్నవరం సత్యదేవుడి ఆలయం

అన్నవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గత కొంతకాలంగా అస్తవ్యస్తంగా మారిన పాలన నూతన ఈవో రాకతో గాడిన పడుతుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. వైసీపీ హయాంలో సుమారు రూ.6కోట్లు అనవసర వ్యయమయింది. అనంతరం గతేడాది కార్తీకమాసంలో రామచంద్ర మోహన్ బాధ్యతలు స్వీకరించినా ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు ఉండడంతో వారంలో రెండురోజులు మాత్రమే అన్నవరం విచ్చేసి మిగిలినరోజులు ఈ ఫైలింగ్, చరవాణిలా ద్వారా పాలనను నడిపించారు. అనంతరం ఆయనను దేవదాయశాఖ ప్రధాన కార్యాలయానికి పరిమితం చేసి అన్నవరం దేవస్థానం ఈవోగా సింహాచలం ఈవోగా ఉన్న వేంద్ర త్రినాథరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనపై కూడా రెండు ప్రధానాలయాల బారం పడడంతో పూర్తిస్థాయి దృష్టిసారించే అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న వీర్ల సుబ్బారావు అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఈనెల 14న బాధ్యతలు స్వీకరించారు. అయితే సుబ్బారావు కొన్ని మార్పులకు శ్రీకారం చుట్టారు. గత 4 రోజులుగా ఆయన ప్రతీ విభాగాన్ని క్షేత్రస్థాయిలోకి వెళ్లి అధ్యయనం చేస్తూ ఆయా విభాగాల పనితీరుపై అవగాహన కల్పించుకుంటూ పాలన సాగిస్తున్నారు. ముందుగా ఆయన తీసుకున్న నిర్ణయం అప్పటివరకు ప్రతి ఫైలు గుమాస్తా వద్ద నుంచి ఏఈవోకు చేరుకున్న తరువాత నేరుగా ఈవోకు చేరేది. అయితే ఈ విధానం తప్పని గ్రహించి పారదర్శకత కోసం సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌కు చేరిన తరువాతే తన వద్దకు పంపాలని ఆదేశించారు. దీంతో కొన్ని వర్గాలకు ఈ విధానం మింగుడుపడకపోవడంతో పా లన గాడినపడుతున్నట్లేనని చర్చించుకుంటున్నా రు. ముందుగా ఆలయంలో విభాగాలు ఎన్ని ఉన్నాయి, వాటి నిర్వహణ తీరు ఏవిధంగా ఉంది తెలుసుకుని నేరుగా ఆయా విభాగ కార్యాలయానికి చేరుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. మరికొన్ని విభాగాలకు సంబంధిత విభాగ ఏఈవో, సూపరెంటెండెంట్‌ను కార్యాలయానికి పిలిపించి మాట్లాడడం చేస్తుండడంతో కిందిస్థాయి ఉద్యోగుల్లో గుబులు ప్రారంభమైంది. మరో 15 రోజులు గడిస్తే పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకుని పాలన పరుగులు పెట్టించేవిధంగా అడుగులు పడతాయని భావిస్తున్నారు. అయితే రాజకీయనేతలు పాలనా వ్యవహారాల్లో వేలు పెట్టనంతవరకు సవ్యంగానే నడుస్తుందని లేకుంటే యథావిధిగా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నవిదంగా తయారవుతుందనడంలో సందేహం లేదు.

ఆందోళనకరంగా ఆర్థిక పరిస్థితి...

ప్రధానంగా అన్నవరం ఆలయంలో ఆర్థిక పరిస్థితి ఆందోళన కలిగిస్తుంది. గత అధికారులు ఇష్టారీతిన అనవసర వ్యయం చేయడం వాటికి నేడు చెల్లింపులు చేపట్టడంతో బడ్జెట్ మించిపోయింది. దీంతో మిగిలిన నాలుగు నెలలు ఏవిధంగా నెట్టుకురావాలో అర్థంకాని ప్రశ్న. దీనికి సంబంధించి సప్లమెంటరీ బడ్జెట్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నవరం ఆలయంలో గత 3 దశాబ్దాలుగా ఏటా స్వామివారి పేరున మిగులు నిధులు డిపాజిట్ చేసేవారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా డిపాజిట్లను విత్‌డ్రాయల్ చేయకుండా చూశారు. ఈ ఏడాది మాత్రం సుమారు రూ.5 కోట్లు వరకు డిపాజిట్లను క్యాన్సిల్ చేయడంతో అన్నవరం ఆలయ ఆర్థిక పరిస్థితి ఏవిధంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. వచ్చే ఏడాది మార్చివరకు అనవసర ఖర్చులు తగ్గించి ఆదాయ మార్గాలు పక్కకు వెళ్లకుండా దేవస్థానం ఖజానాకు చేరితే ఆర్థిక పరిస్థితి కొంత మెరుగవ్వచ్చు. ఏది ఏమైనా ఏడాది కాలానికి డిప్యుటేషన్‌పై వచ్చిన నూతన ఈవో సుబ్బారావు సవాళ్లతో కూడిన పాలన చేయాల్సి వస్తుంది. ఆయనకు సత్యదేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆశిద్దాం.

ముగ్గురి హత్య కేసులో...
వేట్లపాలెంలో 12 మంది అరెస్ట్

- అరెస్టయిన వారిలో ముగ్గురు మహిళలు
- మారణాయుధాలు, ఆటో స్వాధీనం
- పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐలు

సామర్లకోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేట్లపాలెంలో ఇంటి నిర్మాణంలో 2 కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదంలో ఒక కుటుంబంపై మరొక కుటుంబం కత్తులు వంటి మారణాయుధాలతో ఆదివారం రాత్రి దాడులకు పాల్పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులను హత్య చేసి మరో ఏడుగురిని గాయపరిచిన 12 మంది వ్యక్తులను బుధవారం సాయంత్రం సామర్లకోటలో అరెస్ట్ చేసినట్టు సామర్లకోటలో బుధవారం రాత్రి విలేకరుల సమావేశంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వెల్లడించారు. వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం శివారు దళితచెరువు వద్ద కార్థాల పండు అనే వ్యక్తి ఇంటినిర్మాణంలో భాగంగా శ్లాబ్ పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన బచ్చల మోషే, బచ్చల జకరయ్య, బచ్చల బిల్లప్ప అనే బుల్లప్పి, బచ్చల దొరయ్య, బచ్చల రాము, బచ్చల రాజ్‌కుమార్, బచ్చల చంద్రరావు, గుల్ల సన్నీ, శికోటి రాజేంద్రప్రసాద్, బచ్చల గోపీ, బచ్చల గవరయ్య, బచ్చల రాజు, గుడాల సునీల్, బచ్చల సూర్యాకాంతం, బచ్చల భాగ్యవతి, ద్రోణం సత్యవేణి మరికొందరు వ్యక్తులతో కలిసి తొలుత ఇంటి నిర్మాణదారుడితో ఘర్షణలకు సిద్ధపడ్డారు. ముందుగా అనుకున్న వ్యూహం మేరకు తమ వెంట తెచ్చుకున్న కత్తులతో కార్థాల కుటుంబాలకు చెందిన వ్యక్తులపై దాడులకు దిగి నరకడంతో ముగ్గురు మృతి చెందారు. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో పోలీసులు అరెస్టు చేసినవారిలో బచ్చల జకరయ్య, బచ్చల మోషే, బచ్చల బిల్లప్పన్న అనే బుల్పప్పి, బచ్చల దొరయ్య అనే దొరబాబు, బచ్చల రాము, బచ్చల గోపీ, బచ్చల గవరయ్య అనే చంటి, బచ్చల రాజు, బచ్చల సూర్యాకాంతం, బచ్చల భాగ్యవతి, ద్రోణం సత్యవేణి, కొత్తపల్లి చిన్నయ్యలు ఉన్నారు. హత్యకు ఉపయోగించిన 5 మారణాయుధాలు, 3 కర్రలతో పాటు దాడులకు వినియోగించిన ఆటో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. రెండు కుటుంబాల మధ్య ఆధిపత్య పోరే ముగ్గురి హత్యలకు దారి తీసిందని డీఎస్పీ చెప్పారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు అడ్మిన్ ఎస్పీ సూచనలతో పెద్దాపురం డీఎస్పీ పర్యవేక్షణలో సామర్లకోట సీఐ, పెద్దాపురం క్రైం సీఐ తదితర ఎస్‌ఐలతో కలిసి వేట్లపాలెం జీవీకె విద్యుదుత్పత్తి కేంద్రం రోడ్డులో నిందితులను అరెస్ట్ చేశారు. ఇదే కేసులో మరికొందరిని అరెస్ట్ చేయాల్సి ఉందని, కేసు దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతుందని డీఎస్పీ శ్రీహరి రాజు చెప్పారు. కాగా 12 మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు పోలీసులు పేర్కొన్నప్పటికీ విలేకరుల సమావేశంలో అరెస్ట్ చేసినవారినెవ్వరినీ పాత్రికేయుల సమావేశంలో హాజరుపర్చకపోవడం గమనార్హం.


పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు

కోట సత్తెమ్మ కరుణించమ్మా...


ప్రత్యేక అలంకరణలో కోట సత్తెమ్మ అమ్మవారు


బోనాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్తున్న మహిళలు

వైభవంగా బోనాల సమర్పణ

నిడదవోలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమ్మలగన్న అమ్మ కోటసత్తెమ్మతల్లి అందరిని కరుణించమ్మా అంటూ మహిళలు పెద్ద ఎత్తున బోనాలు నెత్తిన పెట్టుకుని అమ్మవారికి చీర, సారె పసుపు కుంకుమలతో తరలివచ్చారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజు పాలెంలో మేళ తాళాలతో అంగరంగ వైభవంగా కోట సత్తెమ్మకు బుధవారం చీర సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట సత్తెమ్మ తిరునాళ్లలో నాల్గోరోజైన బుధవారం రాజమహేంద్రవరానికి చెందిన అఖిలభారత తెలుగు సేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, అడ్వకేట్ జి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో 101 మంది మహిళలతో అమ్మవారికి చీర, సారె, పసుపుకుంకుమలు సమర్పించారు. రాజమ హేంద్రవరం నుంచి బోనాలతో తరలివచ్చిన మహిళల ను దేవస్థానం సహాయ కమిషనర్ బి.హరి సూర్య ప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, సూపరింటెంట్ జల్లా సోమరాజు ఆహ్వానించారు. మహిళలు బోనాలు సమర్పించారు.. అనంతరం ఆలయ ప్రధానార్చ కుడు అప్పారావుశర్మ, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రూ.20 లక్షలకు రూ.20 కోట్లు వస్తాయని...

రైస్ పుల్లింగ్ పేరుతో మోసం చేసిన ఏడుగురి అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సర్పవరం సీఐ పెద్దిరాజు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైస్ పుల్లింగ్ పేరుతో ఓ వ్యక్తిని మోసం చేసిన ఏడుగురు నిందితులను సర్పవరం పోలీసులు అరెస్ట్ చేశారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటకు చెందిన పెనుమత్స నాగరాజు కాంట్రాక్ట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సుమారు ఏడాది కింద అరకు వెళ్లాడు. అక్కడ నాగరాజుకి ఏఎస్ఆర్ జిల్లా పిట్ట దుమ్ముగూడెం మండలం పాడి గ్రామానికి చెందిన పిట్ట గుండన్న, చింతపల్లి మండలం కోతపల్లికి చెందిన గోపీనాయక్, చిన్నలగూడకు చెందిన కిల్లో శ్యాంసన్, కడసిల్పికి చెందిన పొంగి దోహన్ రావు, అరకు వ్యాలీ చిన్నలాబుడకు చెందిన గోపి నాయక్ తిరుపతిరావు, కరబలయ్య సుజాత, సెట్టి బుల్లెమ్మలతో పరిచయం ఏర్పడింది. తమ వద్ద కోట్లు విలువ చేసే రైస్ పుల్లింగ్ కాయిన్ ఉందని, దీనిని విక్రయిస్తే అధిక డబ్బులు సంపాదించవచ్చని, పెట్టుబడి పెట్టాలని నాగరాజుని కోరారు. ఓ కాయిన్‌ని చూపించి ఆశ కల్పించారు. రూ.20లక్షలు పెట్టుబడి పెడితే రూ.20 కోట్లు వస్తాయని నమ్మించారు. వారి మాటలను నమ్మిన నాగరాజు స్నేహితులతో కలిసి నిందితుల అకౌంట్‌లోకి పలు దఫాలుగా రూ.20 లక్షలు పంపాడు. మంగళవారం నిందితులు నాగరాజుకి ఫోన్ చేసి రైస్ పుల్లింగ్ కాయిన్ తీసుకువస్తున్నామని, డబ్బులు సిద్ధంగా ఉంచుకోమని చెప్పారు. డబ్బులు తీసుకుని వెళ్లగా రాగి కాయిన్ ఇచ్చారు. అది పరిశీలిస్తే సీతారామ పట్టాభిషేకం బొమ్మతో ఉంది. మోసపోయినట్టు గుర్తించిన నాగరాజు వారిని ప్రశ్నించాడు. దాంతో నిందితులు చాకు చూపించి రూ.50 వేలు తీసుకుని పరారయ్యారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు మేరకు సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు సురేష్‌నగర్ పార్కు వద్ద ఉండగా అరెస్ట్ చేసి రూ.50 వేలు, చాకు, రాగి కాయిన్‌ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పలువురు నుంచి రైస్‌పుల్లింగ్ కాయిన్ పేరు చెప్పి మోసంచేసి ఉంటారని తెలిపారు.

ఒత్తిడి అధిగమించేందుకు క్రీడలు దోహదం

» ఏపీఎస్పీ కమాండెంట్ ఎం.దీపిక » ముగిసిన యాన్యువల్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ » విజేతలకు బహుమతుల అందజేత

సర్పవరం జంక్షన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యమని, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని ఏపీఎస్పీ కమాండెంట్ ఎం.దీపిక అన్నారు. కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 ముగింపు వేడుకలు బుధవారం ఉత్సాహంగా.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ముగిశాయి. ముగింపు వేడుకల్లో భాగంగా బహుమతి ప్రదానోత్సవంలో ఆమె మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, మానసిక ఉత్తేజం లభిస్తా యన్నారు. నిత్యం వ్యాయామం తప్పనిసరని, పోలీసులు ఫిట్‌నెస్‌తో ఉంటే మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించవచ్చన్నారు. ఏటా యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడంతో ఆరోగ్యంగా, పూర్తి ఫిట్‌గా పోలీసులు ఉంటారన్నారు. 1500 మీటర్లు, 100 మీటర్లు పరుగు పందెం ఫైనల్ పోటీ జరిగింది. స్కావెంజర్స్‌కి స్నాక్ రేస్, బ్యాంకు సిబ్బందికి, టగ్ ఆఫ్ వార్ పోటీలు ఆద్యంతం హోరాహోరీగా సాగింది. పలుపోటీల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు పంపి ణీ చేశారు. టగ్ ఆఫ్ వార్ పోటీలో కాకినాడ జిల్లా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, కమాండెంట్ దీపికలు హుషారుగా పాల్గొని తమ జట్టు సభ్యులతో కలసి తాడు లాగి క్రీడాస్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పోలీసు సిబ్బంది ఆర్కెస్ట్రాలు ఆకట్టుకున్నాయి. ముగింపు వేడుకల్లో భాగంగా క్యాంప్ ఫైర్ వెలిగించారు. ట్రైనీ డీఎస్పీ సృజన, అదనపు కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్లు, ఆర్ఐ తదితర అధికారులు పాల్గొన్నారు.



టగ్ ఆఫ్ వార్ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న కమాండెంట్ దీపిక వెర్సస్ కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బృందం

పలు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం పలు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డా.జె.నరసింహనాయక్ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మసిస్టులు మూడు పోస్టులు, పోస్ట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒక పోస్టు, లాస్ట్ గ్రేట్ సర్వీసెస్ ఎల్‌జీఎస్ 2 పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. కావున అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం నందు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలన్నారు. దరఖాస్తుదారులకు సంబంధించిన నోటిఫికేషన్, అప్లికేషన్ ప్రొఫార్మా **NIC http://east-godavari.ap.gov.in, http://kakinada.ap.gov.in, http://konaseema.ap.gov.in** వెబ్సైట్‌నందు పొందపరిచామని చెప్పారు.

21, 22న ఐలాజ్ జాతీయ మహాసభలు

ప్రత్తిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రెండో జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐలాజ్ ప్రతినిధులు కోరారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఐలాజ్ జాతీయ మహాసభల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కటక్‌లోని కళా వికాస కేంద్రంలో జరిగే మహాసభలకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిక్ ఏకే పట్నాయక్, జస్టిక్ కె.చంద్రు హాజరై 'న్యాయ వ్యవస్థ, స్వతంత్ర' అంశంపై ప్రసంగిస్తారని ఐలాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగతా శివ, కోశాధికారి అవసరాల దేవి తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు ఆర్వీ వెంకట్రావు, కార్యదర్శి బొంగులూరు మధుబాబు, మాజీ అధ్యక్షుడు చిట్టింశెట్టి పుల్లయ్య, సీనియర్ న్యాయవాదులు వి.నరసింహారావు, పలివెల నాగేంద్రరాజు, సోము గౌరీశంకర్, అశోక్‌కుమార్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐలాజ్ ప్రతినిధులు

కాకినాడ ఎంపీకి భారత్ గౌరవ్ అవార్డు


అవార్డు అందుకుంటున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. చిన్న వయసు ఎంపీగా, కాకినాడ జిల్లా అభివృ ద్ధిపై తనదైన మార్క్ చూపిస్తున్న ఆయనకు ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొన్న తొలి ఎంపీగా చరిత్ర సృష్టించగా తాజాగా ప్రతిష్టాత్మక భారత్ గౌరవ్ అవార్డును అందుకున్నారు. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి నుంచి ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జేఎన్టీయూకే ఖోఖో టోర్నమెంట్‌లో
విజేతగా ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు

కాకినాడ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు విజ్ఞాన్ నీరుల మహిళల ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 16,17న జరిగిన జేఎన్టీయూకే కాకినాడ సెంట్రల్ జోన్ మహిళల ఖోఖో టోర్నమెంట్‌లో కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జట్టు విజేతగా నిలిచినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీకాంత్ తెలిపారు. జేఎన్టీయూకే విశ్వవిద్యాలయ పరిధిలోని 13 కళాశాలల జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా ఐడియల్ జట్టు ఫైనల్లో గెలిచి ట్రోఫీని కైవసం చేసుకుందన్నారు. ఈ జట్టులోని సీఎస్ఈ మొదటి సంవత్సర విద్యార్థిని ఐశ్వర్య, ఈసీఈ మొదటి సంవత్సర విద్యార్థిని మౌనిక కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీల్లో జేఎ న్టీయూకే తరఫున ఆడేందుకు ఎంపికయ్యారని తెలిపారు. వారిని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, కార్యదర్శి కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, డైరెక్టర్ జీవీ కృష్ణంరాజు, ఏవో వర్మ, శ్రీహరి వర్మ అభినందించారు.


మహిళల ఖోఖో టోర్నమెంట్ విజేత జట్టుతో డైరెక్టర్, ప్రిన్సిపాల్, ఏవో

14 కాసుల బంగారం, రూ.90వేలు నగదు చోరీ

ఆలస్యంగా వెలుగులోకి

జగ్గంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో కొద్ది రోజుల క్రితం జరిగిన 14 కాసుల బంగారం, రూ.90వేలు నగదు చోరీ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 14న రాత్రి రామవరంలోని రేవాడ బుజ్జిబాబు ఇంటిలో చోరీ జరిగింది. బుజ్జిబాబు భార్యపిల్లలతో రాజమహేంద్రవరంలోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రామవరంలో బుజ్జిబాబు ఇంటిలో తన అత్తగారు భీమవరపు సాయమ్మ(60) నివాసముంటోంది. 14న ఇంటి దగ్గరలోనే ఉంటున్న బంధువుల ఇంటికి సాయమ్మ వెళ్లి రాత్రికి అక్కడే ఉండి పోయిందని, తెల్లవారుజామున వచ్చి చూసే సరికి ఇంటితాళాలు పగలకొట్టి ఉన్నాయని బుజ్జిబాబు తెలిపాడు. అటకమీద డబ్బాలో పెట్టిన 14కాసుల బంగారం, బీరువాలో పెట్టిన రూ.90వేలు నగదు చోరీకి గురికావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్ఐ రఘునాధరావు, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి దర్యాప్తు చేపట్టి కేసు నమోదు చేశారు.

రాజమహేంద్రవరంలో బంగారం చోరీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని లింగంపేటలో ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు వస్తువులు అపహరించుకుపోయారని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. లింగంపేటకు చెందిన వెంకటనారాయణ ఈ నెల 12న కుటుంబ సభ్యులతో కలిసి చెన్నైలోని బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఇంటి తలుపులు తీసి ఉండడం స్థానికులు చూసి వెంకటరమణకు ఫోను చేసి చెప్పారు. దీంతో అతడు బయలుదేరి బుధవారం నగరానికి చేరుకుని ఇంటికి వెళ్లి చూస్తే తలుపుల తాళాలు పగులకొట్టి ఉన్నాయి. లోపల బీరువాలో పెట్టిన 11గ్రాముల బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో ఇంట్లో దొంగలు పడ్డారని గ్రహించి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

జగ్గంపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో యువతకు గంజాయి సరఫరా చేస్తున్నారని జగ్గంపేట పోలీసులకు సమాచారం అందడంతో సీఐ వైఆర్కే శ్రీనివాసరావు గంజాయి పొట్లాలు అమ్ముతున్న వారిపై నిఘా పెట్టారు. ఇందులో భాగంగా బుధవారం కాకినాడ జిల్లా జగ్గంపేట నెహ్రూ కాలనీకి చెందిన 20ఏళ్ల సునీల్, రామవరం గ్రామానికి చెందిన 19ఏళ్ల సుధీర్ జగ్గంపేటలో యువతకు గంజాయి సరఫరా చేస్తున్నారని సమాచారం సీఐ వైఆర్కె శ్రీనివాస్, ఎస్ఐ రఘునందనరావుకు అందింది. దీంతో వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద 2.6 కిలోల గంజాయి దొరికింది. కేసు నమోదు చేసి ఇద్దరిని పెద్దాపురం కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు వారికి 14రోజులు రిమాండ్ విధించడంతో పెద్దాపురం సబ్‌జైలుకు తరలించారు. దాడుల్లో హెచ్ సీ రమణ, నాగరాజు, ఏఎస్ఐ కుమార్ తదితరులున్నారు.

రాజమహేంద్రవరం కార్పొరేషన్
డీఎస్‌వోపై బ్లేడుతో దాడి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ జనన-మరణ విభాగంలో డీఎస్‌వోగా పని చేస్తున్న డి.రవికుమార్‌పై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేశాడు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రవికుమార్ మంగళవారం రాత్రి ఆంధ్రానగర్‌లో తన ఇంటి వద్ద బైక్‌ను పార్క్ చేస్తుండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి రవికుమార్ పీకపై బ్లేడుతో దాడి చేసి పరారయ్యాడు. దీంతో కంఠం పైభాగంలో గాయమైంది. రవికుమార్‌ను కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

రేపటి నుంచి సీపీఎం మహాసభలు

పెద్దాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలో ఈనెల 20 నుంచి సీపీఎం మహాసభలను నిర్వహించనున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ పేర్కొన్నారు. 3 రోజులపాటు జరుగుతాయని పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సభలను విజయవంతం చేయాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

విభిన్న ప్రతిభావంతులకు సహకారమందిస్తా

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ


వీల్‌చైర్ అందిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల అవసరాలకు అనుగుణంగా విద్య, ఆరోగ్య, జీవనోపాధి, పునరావాసర సహాయ కార్యక్రమాలు అమలు చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఉమా మనో వికాస కేంద్రం సేవలు అభినందనీయమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. బుధవారం వాకలపూడిలో ఉమా మనోవికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి ఆధ్వర్యంలో హరియానా గురుగ్రామ్ ఇఫ్కో-టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సౌజన్యంతో 75 మందికి అవసరమైన కృత్రిమ కాళ్లు, కాలిపర్స్, వీల్‌చైర్లు, సీపీ వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతి కోసం సుమారు 3 దశాబ్దాలుగా కుటుంబ సభ్యులకే సాధ్యం కాని రీతిలో ఉమా సంస్థ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని కితాబిచ్చారు. ఇంతటి మంచి కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఉమా వికాస కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్షేమ, అభివృద్ధి, కృత్రిమ అవయవాల తయారీ యూనిట్‌పై ఎమ్మెల్యేకు సంస్థ ఈడీ ఎస్‌పి రెడ్డి వివరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పిడుగు పాండురంగారావు, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాదరావు, ఏవో కె.నారాయణరెడ్డి, తాటికాయల వీరబాబు, గంటా ప్రసాద్, కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు గమనించాలి

గొల్లప్రోలు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు గమనించి తదనుగుణంగా బోధనలో మార్పులు చేయాలని సర్వశిక్షాభియాన్ ఐఈఆర్టీ జిల్లా కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు సూచించారు. గొల్లప్రోలు పట్టణంలోని నాన్‌భవిత కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. టీఎల్ఎం, విద్యార్థుల సర్వే నివేదిక, సిలబస్, ఉపాధ్యాయుల డైరీలను పరిశీలించారు. ఐఈఆర్టీ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మండల వనరుల కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట గొల్లప్రోలు ఎంఈవో శివప్రసాద్ పాల్గొన్నారు.


గొల్లప్రోలులోని నాన్ భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న చామంతి నాగేశ్వరరావు

అండర్ వాటర్ టన్నెల్, జలకన్య ఎగ్జిబిషన్ ప్రారంభం

కాకినాడ సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడలో విజ్ఞాన, వినోదభరిత అండర్ వాటర్ టన్నెల్, జలకన్య ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను బుధవారం సాయంత్రం టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు గ్రంధి బాబ్జి ప్రారంభించారు. భారీ షార్క్ ఆకారంలోని ముఖద్వారం లోపల అండర్ వాటర్ టన్నెల్ అక్వేరియంలో విదేశాల నుంచి రప్పించిన చేపలను ప్రదర్శనలో ఉంచారు. భారీ వాటర్ టబ్‌లో జలకన్య విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా అతిథులు అండర్ వాటర్ టన్నెల్‌లోని చేపలను, జలకన్య విన్యాసాలను తిలకించారు. అనంతరం మీడియా సమావేశంలో బాబ్జి మాట్లాడుతూ కాకినాడ నగర పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించాలని కోరారు. కార్యక్రమంలో కౌడా మాజీ డైరెక్టర్ గట్టి సత్యనారాయణ, టీడీపీ నాయకులు బచ్చు శేఖర్, బొబ్బిలి గోవిందు, జోగా రాజు, చింతా కామేష్, నేమాని సత్యనారాయణ, దవులూరి భద్రరావు పాల్గొన్నారు.


అండర్ వాటర్ టన్నెల్‌ను తిలకిస్తున్న గ్రంధి బాబ్జి, గట్టి సత్యనారాయణ తదితరులు

అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

సామర్లకోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రానున్న రెండేళ్లలో పెద్దాపురం నియోజకవర్గం సర్వతో ముఖాభివృద్ధికి పలు అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరయ్యాయని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వెల్లడించారు. బుధవారం సాయంత్రం సామర్లకోట మండలం అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో విలేకరులతో రాజప్ప మాట్లాడుతూ పశువులమ్మ గుడి సమీపం నుంచి ఏలేరు కాలువ మీదుగా రైల్వే ట్రాక్‌ను దాటుతూ కేంద్రప్రభుత్వం రైల్వే నిర్మించనున్న ఆర్వోబీ పనులకు రూ.100కోట్ల నిధుల విడుదలకు కేంద్రప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయన్నారు. టెండర్ ప్రక్రియలో ఉందన్నారు. ఇప్పటికే సామర్లకోట సమీపాన ఉండూరు కూడలి నుంచి అచ్చంపేట వరకూ నిర్మిస్తున్న 4 లేన్ల ఏడీబీ రోడ్ నిర్మాణంతోనూ, రాక్ సిరామిక్ నుంచి చెరకు యార్డు మీదుగా భీమేశ్వరాలయం వెనుక నుంచి ఏలేరు కాలువ, గోదావరి కాలువ, కాకినాడ రోడ్డులను దాటుతూ శరవేగంతో నిర్మిస్తున్న సాగరమాల రోడ్డులతో సామర్లకోట పట్టణానికి ట్రాఫిక్ చిక్కులు శాశ్వతంగా తొలగిపోగవని పేర్కొన్నారు. అలాగే సామర్లకోట సమీపాన జీ.రాగంపేట వద్ద సుమారు 11.15 ఎకరాల విస్తీర్ణంలో ఎంజేపీ ఏపీబీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి రూ.50కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఇది పూర్తయితే పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌కు చెంది సుమారు 480మంది వెనుకబడిన తరగతులకు చెంది విద్యార్థులకు విద్యావసతి సదుపాయాలు అందనున్నట్లు చెప్పారు. సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో 2 కూడలి ప్రాంతాల్లో ఫౌంటెన్ నిర్మాణం తదితర సుందరీ కరణ పనుల కోసం రూ.10లక్షల చొప్పున మంజూరయ్యాయన్నారు. మంత్రి నారాయణ కృషి మేరకు సామర్లకోట, పెద్దాపురం పట్టణాల ప్రజల వ్యాయామం నిమిత్తం 2 ఓపెన్‌జిమ్‌లు మంజూరు చేయాలని కోరడంతో మంత్రి సానుకూలంగా స్పందించి 2 ఓపెన్‌జిమ్‌లను మంజూరు చేస్తున్నట్లు భరోసా ఇచ్చారని వెల్లడించారు.


ఎమ్మెల్యే రాజప్పను పరామర్శిస్తున్న మంత్రి

రాజప్పకు మంత్రి పరామర్శ

పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను మంత్రి పొంగూరి నారాయణ బుధవారం సాయంత్రం అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకుని యోగ క్షేమాలు ఆరాతీశారు. ఇటీవల క్రైడా చైర్మన్ తుమ్మల బాబు ప్రమాణ స్వీకారమహోత్సవంలో వేదిక కూలిన ఘటనలో రాజప్ప గాయపడిన విషయం విదితమే. మంత్రి రాజప్పను పరామర్శించి మెరుగైన వైద్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

డిప్యూటీ సీఎం పవన్‌ని కలిసిన డాక్టర్ చంద్రశేఖర్


డిప్యూటీ సీఎం పవన్‌కు పూలబొకే అందిస్తున్న పద్మశ్రీ డాక్టర్ చంద్రశేఖర్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పెనుమర్తి శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సంకురాత్రి ఫౌండేషన్ ద్వారా అంధత్వ నివారణ కోసం, నిరుపేదల నేత్ర సంరక్షణ కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. రాష్ట్రంలో అంధత్వం నివారణ కోసం, నిరుపేదల నేత్ర సంరక్షణ, నేత్రచికిత్సలు అందిస్తూ నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సంకురాత్రి ఫౌండేషన్‌కు ప్రభుత్వ పరంగా అండా ఉంటామని పవన్ తెలిపారు. ఈ సంస్థకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో శాసనమండలి విప్ పిడుగు పాండురంగారావు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివశ్రీనివాస్, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీడీవో మృతి


హరిప్రియ (ఫైల్)

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 18(ఆంధ్ర జ్యోతి): గొల్లప్రోలు పూర్వ ఎంపీడీవో పి.హరిప్రియ(36) ఆకస్మికంగా మరణించారు. ఈమె ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. డెలివరీ సమయంలో బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత గుండెపోటుకు గురై మరణించినట్టు అధికారులు తెలిపారు. ఆమె 2019 నుంచి 22 వరకూ గొల్లప్రోలు ఎంపీడీవోగా పనిచేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సంతాపం తెలియజేశారు.

బాలుడు అదృశ్యం



ప్రత్తిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి 14ఏళ్ల బాలుడు తూరంగి అరవింద్ అదృశ్యమైనట్టు స్థానిక సీఐ బి.సూర్యఅప్పారావు బుధవారం తెలిపారు. ఈ నెల 12న ఇంట్లో మందలించారని అరవింద్ అలిగి వెళ్లిపోయినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు ప్రత్తిపాడు సీఐ, ఎస్‌లకు 94407 965 30, 94407 96570 నెంబర్లలో తెలియజేయాలని కోరారు.

రెవెన్యూ సదస్సులతో భూ వివాదాల పరిష్కారం

కాకినాడ రూరల్ తహశీల్దార్ కుమారి

పలుచోట్ల రెవెన్యూ సదస్సులు


రోడ్డు పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించాలని ఆదేశిస్తున్న తహశీల్దార్ కుమారి

సర్పవరం జంక్షన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు కాకినాడ రూరల్ తహశీల్దార్ ఎస్ఎల్ఎస్ కుమారి తెలిపారు. బుధవారం తిమ్మాపురం గ్రామ పంచాయతీ వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల వద్ద నుంచి భూ సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా రీసర్వేలో భూమి విస్తీర్ణం, సర్వేలో వచ్చిన వినతులను 45 రోజుల తర్వాత పరిష్కరించడం జరుగుతుందన్నారు. అచ్చంపేట సెంటర్‌లో రోడ్డు పక్కన పంట కాలువను ఆక్రమించి దుకాణాలు, బడ్డీ కొట్టు ఏర్పాటు చేశారని, వాటిని తొలగించాలంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. పంట కాలువ పక్కన అక్రమంగా దుకాణాలు, షెడ్లు, ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని, తక్షణం వాటిని తొలగించాలని తహశీల్దార్ ఆదేశించారు. లేదంటే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు నిలుపుదల చేయిస్తానంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ సురేష్, సర్వేయర్ రామకృష్ణ, గ్రామ కార్యదర్శి పబ్బినీడి శ్రీనివాస్, వీఆర్వో నున్న సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోట: రెవెన్యూ సదస్సులను భూయజమానులు సద్వినియోగం చేసుకోవాలని సామరకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. మండలంలో నవర పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం రెవెన్యూ సదస్సు డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ మాట్లాడారు. గ్రామంలో పలు భూసమస్యల విస్తీర్ణం వ్యత్యాసం సరిచేయమని, సబ్ డివిజన్ చేయమని కోరుతూ 8 అర్జీలను స్వీకరించారు. కార్యాలయ సూపరింటెండెంట్ కె.పద్మజ, నవర పీఏసీఎస్ సీఈవో వీరంరెడ్డి కామేశ్వరరావు, వెన్నా పద్మనాభం, లక్ష్మణరావు, వీఆర్వోలు చంద్రబాబు, అప్పారావు, నాగేశ్వరరావు, ఫాజల్ అబ్బాస్, సుబ్బారావు, సర్వేయరు సీతారామా చార్యులు, గ్రామ సర్వేయరు ముసలయ్య, దయాకిరణ్, డీఈవో హరి రైతులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తుందని డిప్యూటీ తహశీల్దార్ ఎమ్.సూరిబాబు అన్నారు. ఇంజరం పంచాయతీలో సర్పంచ్ ముద్దన శివరామప్రసాద్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని రైతులు అర్జీలు అందజేశారు. సదస్సులో రెవెన్యూ, సచివాలయం, పంచాయతీ అధికారులు ఉన్నారు.


సామర్లకోట: సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్


కొత్తపల్లిలో ముగింపు శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో 2 పైడిరాజు

పటిష్టమైన ప్రణాళికతో గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

కొత్తపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాలు సర్వతో ముఖాభివృద్ధి సాధించడం కోసం కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న 15 సూత్రాలను పక్కాప్రణాళికతో అమలుచేయాలని కొత్తపల్లి ఎంఈవో-2 జి.పైడిరాజు అన్నారు. కొత్తపల్లి మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులకు గ్రామాభివృద్ధిపై నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ శిక్షణలో ఈవోపీఆర్డీ సత్యారెడ్డి, సర్పంచులు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో ముగిసిన శిక్షణా తరగతులు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలపరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశాలపై రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణా తరగతులు బుధవారం సాయంత్రంతో ముగిశాయి. గ్రామాల వారీగా ప్రణాళికల రూపకల్పనపై చర్చించారు. శిక్షణా తరగతుల్లో గొల్లప్రోలు ఎంపీడీవో కర్రి స్వప్న, ఎంఈవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ కుమార్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

60ఏళ్లు దాటినా ఆయుష్మాన్ భారత్ వర్తింపచేయాలి

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): 60 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్స్ అందరికీ ఆదాయంతో నిమిత్తం లేకుండా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా వర్తింపచేయాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణరాజు కోరారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్టు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ 70ఏళ్ల పైబడిన వారందరికీ ఆదాయంతో నిమిత్తం లేకుండా కేంద్రం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా వర్తింపచేస్తుందన్నారు. లబ్ధిదారులకు రూ.5లక్షలు విలువచేసే వైద్యాన్ని ఉచితంగా అందిస్తుందన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధరాజు

'అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాలు రద్దు చేయాలి'

గొల్లప్రోలురూరల్, డిసెంబరు 18(ఆంధ్ర జ్యోతి): అదానీతో విద్యుత్ తదితర ఒప్పందాల వ్యవహారంలో భారీ అవినీతి జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సదరు ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసుకోవాలని సీపీఐ(ఎం ఎల్) లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యురాలు కాకర రత్న కుమారి డిమాండ్ చేశారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో బుధవారం లిబరేషన్ జాతీయ నేత వినోద్‌మిశ్రా 26వ వర్ధంతి సభ జరిగింది. బీజేపీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతి రేకంగా మిశ్రా పోరాడారని తెలిపారు. లిబరేషన్ నాయకులు నక్కా రమణ, కన్నడ రంగమ్మ, లక్ష్మీ, తంగెళ్ల రామాయమ్మ ఉన్నారు.



చెందుర్తిలో నిర్వహించిన వినోద్‌మిశ్రా వర్ధంతి సభలో పాల్గొన్న లిబరేషన్ ప్రతినిధులు

కుంతీమాధవుడికి విశేష పూజలు



పిఠాపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణంలోని కుంతీమాధవ స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం విశేష పూజలు జరిగాయి. స్వామికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చనలు, గోదా అమ్మవారికి శ్రీ చూర్ణం అర్చనలు నిర్వహించారు. ద్రవిడ ప్రబంధ పారాయణ, పాశుర విన్నపం, గోదాఅమ్మవారి మాడవీధి సేవ జరిగాయి. ఆలయ ఈవో నున్న శ్రీరాములు, భక్తులు పాల్గొన్నారు.

తేమశాతం పేరుతో మిల్లర్లు మోసగిస్తున్నారు

- జాతరల సమయాల్లో ప్రదర్శనలకు అనుమతి ఇవ్వాలి
- ఇన్‌చార్జి మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లిన మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తేమశాతం పేరుతో మిల్లర్లు మోసగిస్తున్నారని, దీనివలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. మిల్లులవద్ద తేమశాతాన్ని నిర్ధారించే యంత్రాలను ప్రభుత్వమే ఏర్పాటుచేసి ప్రత్యేకంగా ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేశారు. కాకినాడలో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి సమావేశానికి వచ్చిన ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి నారాయణ దృష్టికి ఆయన పలు సమస్యలను తీసుకువెళ్లారు. గ్రామాల్లో జాతర్లు, పండుగల సమయాల్లో నాటకాలు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తున్నదని, అలాంటి సందర్భాల్లో మైకులు, మ్యూజిక్ బ్యాండులను పోలీసుల అనుమతించకపోవడం వలన ప్రజల విశ్వాసాలు దెబ్బతింటున్నాయని వర్మ తెలిపారు. వీటికి అనుమతి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీలకు అనుగుణంగా ఏలేరు ఆధునికీకరణ ఫేజ్-2తో పాటు అర్ధాంతరంగా నిలిచిన ఫేజ్-1 పనులు తక్షణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం ఈపనులను కక్షపూరితంగా నిలిపి వేసిందన్నారు. పిఠాపురం శివారు ఏలేరు, గొర్రిఖండి కాలువలు ధర్మవరం-పి.దొంతమూరు మధ్య గల వంతెనలను వెడల్పు చేయాలని, మల్లవరం, నాగులాపల్లి కళింగల్స్‌ను ఆధునీకరించాలని సూచించారు. కొత్తపల్లి మండలం కొమరగిరి లేఅవుట్‌లో ఉపాధినిధులు, ఇతర నిధులతో చేపట్టిన ఫిల్లింగ్ పనుల్లో అవతవకలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇందులో జరిగిన అవినీతిని వెలికితీయాలని కోరారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ, చేబ్రోలు తదితర గ్రామాల్లో నాసిరకం విత్తనాలతో పత్తి, మిరప రైతులు నష్టపోయారని, వీరికి పూర్తి పంట నష్టపరిహారం చెల్లించడంతోపాటు విత్తన కంపెనీలపై కేసులు నమోదు చేయాలన్నారు. ఉప్పాడలో అన్నక్యాంటీన్ నిర్మించాలని కోరారు. వీటిపై మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించి పరిష్కారంకోసం జిల్లా కలెక్టరు, ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చారని వర్మ తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు (ఆంధ్రజ్యోతి): శాంతినగర్‌లో ప్రియ ఇంటర్నేషనల్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ పావని, ప్రిన్సిపల్ నరేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ముందుగా విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ క్రైస్తవ సోదరులకు మరిచిపోలేని ఒక తీయని అనుభూతిని పంచే వేడుకన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి క్రిస్మస్ తాతకు తినిపించారు. కళాశాల సిబ్బంది రమేష్, అగస్త్య, సుశీల్, మోహన్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన బీజేపీ నేతలు

పెద్దాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రులను నితిన్ గడ్కరీ, గజేంద్ర సింగ్ షెకావత్ తదితరులను స్థానిక బీజేపీ నేతలు కలుసుకున్నారు. దీనిలో భాగంగా బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరీ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు బిక్కిన విశ్వేశ్వరరావు, యార్లగడ్డ రామ్‌కుమార్ కలుసుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి పలు సమస్యలు, అభి వృద్ధి కోసం వినతి పత్రాలను సమర్పించినట్లు పేర్కొన్నారు.


కేంద్ర మంత్రితో బీజేపీ నేతలు

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు నల్లా శ్రీనివాస్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరయిన రూ.1.28లక్షల చెక్కును అందజేశారు. వైద్యం కోసం ఎంత మొత్తాన్నయినా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, నాయకులు నామా దొరబాబు, సకుమళ్ల గంగాధర్, అల్లవరపు నగేష్, అద్దూరి శ్రీను, కర్నాసుల రాజా, కోళ్ల బంగారుబాబు, రాయుడు శ్రీను, గొడుగుల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


పిఠాపురంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి

పిఠాపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల పరిరక్షణ, స్వయంప్రతిపత్తి కోసం జనవరి 5న చేపట్టిన హైందవ శంఖారావం బహిరంగసభను విజయవంతం చేయాలని ఆర్ఎస్ ఎస్ ప్రతినిధి రామచంద్రరావు కోరారు. పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హిందూ సంఘాల ప్రతినిధులతో కలిసి శంఖారావం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు కొండేపూడి శంకరరావు, కాగిత నాగేశ్వరరావు, మురళీ, మధు, సుబ్బారావు, శివ, కీర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పిఠాపురంలో హైందవ శంఖారావం పోస్టర్లును ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ఎస్, హిందూ సంఘాల ప్రతినిధులు

మహారాజశ్రీ కాకినాడ 3వ జిల్లా జడ్జి వారి కోర్టులో
IA 1023/2024 OS 1214/2022
Between:
1) పాలకుర్తి సుబ్బారావు (లైద్)
2) పాలకుర్తి సీతా మహాలక్ష్మి
3) పాలకుర్తి సత్యనారాయణ ప్రసాద్ ...వాదులు
and
పుమ్మెళ్ల అన్నపూర్ణమ్మ వగైరా .... ప్రతివాదులు
29 వ ప్ర రెస్పాండెంటు - ప్రతివాది
బొద్దు విజయకుమార్, తండ్రి: శ్రీకృష్ణారావు, డోర్ నెం.16-5-10, కొత్తూరు, సామర్లకోట-533440, కాకినాడ జిల్లా
పై నెంబర్ పిటీషన్‌లో (మిమ్ములను మీ అమ్మగారు సత్యవతి చనిపోయినందున వారసులుగా చేర్పించమని) మీకు శ్రీకోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనక EVADE చేసినందున, నోటీసు పేపరు ప్రకటన ద్వారా ఇమ్మని శ్రీ కోర్టును వారు ఆర్డర్ చేసియున్నారు. వాయిదా ది.30-12-2024 సంవత్సరమునకు ఉన్నది. మీరు వాయిదా రోజు అనగా ది.30-12-2024 సం॥లేదీన ఉదయం గం.10.30 ని॥లకు మీరు స్వయముగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా కోర్టుకు హాజరై ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల మనవి చేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)
ఉప్పలూరి రామారావు, అడ్వకేట్
కాకినాడ 63-3-4బి, ఉప్పలూరి వారి వీధి,
తేది:12-12-2024 కాకినాడ-3, సెల్: 99490 45514



రూ.300 వేతనం వచ్చేలా ఉపాధి కల్పించాలి: ఎంపీడీవో బుజ్జి

గండేపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి కూలీకి రూ.300 వేతనం వచ్చేలా ఉపాధి పని దినాలు కల్పించాలని ఎంపీడీవో నాతి బుజ్జి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏపీవో గంగాభవాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధి హామీ సమీక్షకు ఆమె హాజరయ్యారు. మండలానికి ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేయాలని, ఉపాధి హామీ ద్వారా పథకాలన్నీ అందేలా చూడాలన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

సబ్ ప్లాన్ గిరిజనుల అభివృద్ధికి చర్యలు

రంపచోడవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సబ్ ప్లాన్ ఏరియాలోని గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం ఆయన తన చాంబరులో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ ప్లాన్ ఏరియాలోని ఉన్న గిరిజన తెగలకు సంబంధించిన ఆధార్ కార్డుల జాబితాను సిద్ధం చేసి సమర్పించాలన్నారు. మైదాన ప్రాంత గిరిజనుల అభివృద్ధికి నోడల్ అధికారిగా పరమేశ్వరరావును నియమించినట్టు తెలిపారు. మైదాన ప్రాంతాల్లోని గిరిజనులకు వందన వికాస్ కేంద్రాల ద్వారా మినీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు కల్పిస్తామన్నారు. జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, వెలుగు ఏపీడీ దేగలయ్య, ఏటీడబ్ల్యువోలు రామతులసి, కృష్ణమోహన్, నాగజ్యోతి, డీపీఎం అపర్ణ, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం



ప్రత్యేక అలంకరణలో అటకేశ్వర స్వామి, ఆలయంలో పూజలు జరిపిస్తున్న అర్చకుడు కుమార్‌స్వామి

ఘనంగా అటకేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

మోతుగూడెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొల్లూరు జల విద్యుత్ ఓవల్ ఆఫీస్ కొండపై ఉన్న అటకేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచామృత అభిషేకం, బిల్వార్చన, రుద్ర హోమంలను పొల్లూరు శ్రీమల్లేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి కుమార్‌స్వామి శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు దంపతులు కర్తలుగా వ్యవహరించారు. ఏపీ జెన్కోలో పొల్లూరు సివిల్ విభాగంలో పనిచేస్తున్న చువ్వాకుల రాజశేఖర్-వెంకటలక్ష్మి దంపతులు దాతలుగా అన్నదానం నిర్వహించారు.

ఆలయ కమిటీ సభ్యులు గోవిందరాజు, జాజుల రత్నాకర్, రాజశేఖర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, డీఈ భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వరప్రసాద్, యూనియన్ బ్యాంకు మేనేజరు విత్తనాల సత్యనారాయణ దంపతులు, ఏడీఈ కొండబాబు దంపతులు, ఏఈ పవన్, పొల్లూరు గ్రామస్తులు, మోతుగూడెం గ్రామస్తులు, ఒడిశా భక్తులు పాల్గొన్నారు.


అటవీ రేంజ్ అధికారికి మెమోరాండం అందజేస్తున్న ఆదివాసీ నాయకులు

రోడ్ల నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు

అడ్డతీగల రేంజ్ అధికారితో ఆదివాసీ నాయకులు

వై.రామవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వాలు రోడ్లు మంజూరు చేస్తున్నా వాటి నిర్మాణాలకు అటవీ శాఖ ఆటంకం కల్పిస్తోందని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం నాయకులు ధ్వజమెత్తారు. వై.రామవరం-గుర్తేడు రోడ్డు నిర్మాణం కోసం మూడు రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆదివాసీల దీక్షా శిబిరం వద్దకు బుధవారం వచ్చిన అటవీ శాఖ అడ్డతీగల రేంజ్ అధికారి సయ్యద్ సాన్నెషను నాయకులు ప్రశ్నించారు. సంఘం జిల్లా కార్యదర్శి నడిగొంట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కోట్ల రూపాయలతో మంజూరైన గుర్తేడు రోడ్డు పనులను రిజర్వు ఫారెస్టు నిబంధనల సాకుతో ఏళ్ల తరబడి నిలిపివేశారన్నారు. దీంతో గిరిజనులకు విద్య, వైద్య, మౌలిక సదుపాయాలు కుంటుపడ్డాయన్నారు. దీనికి రేంజ్ అధికారి స్పందిస్తూ... తన పరిధిలోని గుర్తేడు రోడ్డు నిర్మాణంపై గతంలోనే ప్రభుత్వానికి నివేదిక అందించామని, పనులకు ఆటంకం కాబోమని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణంపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు దీక్షలు విరమించేది లేదని నాయకులు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు గుడ్ల త్రిమూర్తులు, లక్ష్మణరావు, బత్తుల శారద, అటవీ శాఖ డీఆర్వో భాస్కరరావు, ఎఫ్‌బీవో సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

'ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల డిమాండ్లను పరిష్కరించాలి'

రంపచోడవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్ల న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభ కన్వీనర్ మాదే రామచంద్రరావు కోరారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షా శిబిరాన్ని బుధవారం ఆయనతో పాటు ఆదివాసీ (గిరిజన) సంఘం నాయకుడు లోతా రామారావు, సీఐటీయూ నాయకురాలు మట్ల వాణిశ్రీ, ఐఏకేఎంఎస్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు ఐవీ రమణ సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం అంబేడ్కర్ సెంటరు వరకు ర్యాలీ నిర్వహించి భిక్షాటన చేశారు.



దీక్షా శిబిరం వద్ద సంఘీభావం ప్రకటిస్తున్న రామచంద్రరావు

అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్

ఎటపాక, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని తవ్వి పురుషోత్తపట్నం నుంచి ట్రాక్టర్లలో భద్రాచలం రవాణా చేస్తున్న భద్రాచలం పట్టణానికి చెందిన రెండు ట్రాక్టర్లను గోళ్లగట్ట క్రాస్‌రోడ్‌లో సెయింటాన్స్ పాఠశాల వద్ద రెవెన్యూ అధికారులు బుధవారం పట్టుకున్నారు. మట్టి తవ్వకాలకు, తరలింపునకు ఎటువంటి అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మేడివాయిలో అక్షయ్ ఫంక్షన్ హాలు ఎదురుగా ఓ గ్రౌండ్‌లో నిల్వ ఉంచిన ఇసుకను రెవెన్యూ అధికారులు, ఎస్ఐ పార్థసారధి సీజ్ చేశారు. సుమారు మూడు ట్రాక్టర్ ట్రక్కుల ఇసుకగా గుర్తించారు. ఇసుక ఉన్న గ్రౌండ్ గేట్‌కు తాళం వేశారు.


మేడివాయిలో ఇసుక అక్రమ నిల్వలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ఎటపాక ఎస్ఐ పార్థసారధి బదిలీ

ఎటపాక, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎటపాక ఎస్ఐ కె.పార్థసారధిని గుర్తేడు బదిలీ చేస్తూ అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో పాడేరు స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న అప్పలరాజును ఎటపాక బదిలీ చేశారు. ఆయన రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలిసింది.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం

అజెండాలోని అంశాలను తీర్మానించకుండానే అర్ధంతరంగా ముగిసిన ఏలేశ్వరం కౌన్సిల్ సమావేశం

ఏలేశ్వరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. అజెండాలోని అంశాలను సీనియర్ అసిస్టెంట్ శేషురాజు చదువుతుండగా... పలు వార్డుల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవట్లేదని కౌన్సిలర్ బదిరెడ్డి గోవింద్ ఆరోపించారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు. ఉన్న నిధులతో సచివాలయాల పరిధిగా కాకుండా వార్డుల వారీగా పనులు చేపట్టి నగర పంచాయతీని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయాలని కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి కోరారు. కమిషనరు సత్యనారాయణ వాహనంలో ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నారో మూమెంట్ పుస్తకంలో నమోదు చేయకుండా డీజిల్ బిల్లు అధికంగా పెట్టడంపై కౌన్సిలర్ సుంకర హైమావతి అసహనం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ భూముల కొనుగోలులో జరిగిన అవకతవకలపై వివరణ ఇవ్వాలని బొదిరెడ్డి గోపి అడిగాడు. ఈ సమయంలో బదిరెడ్డి గోవింద్, కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం జరిగింది. సమావేశం నిర్వహించే ముందు కౌన్సిలర్లకు సమాచారం ఇచ్చి వార్డుల్లో జరిగే పనులు, సమస్యలపై పలు అంశాలను అజెండాలో చేర్చాలన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు ఒకరిపైనొకరు విమర్శలు చేసుకున్నారు. అజెండాలోని 20 అంశాలకు 13 అంశాలను చదవగా నాలుగు అంశాలను మాత్రమే ఆమోదించారు. మిగిలిన వాటిని తీర్మానించకుండానే సమావేశాన్ని అర్ధంతరంగా వాయిదా వేశారు.


కౌన్సిల్ సమావేశంలో విమర్శలు చేసుకుంటున్న టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు

3,600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, ప్రత్తిపాడు ప్రొహిబిషన్-ఎక్సైజ్ సిబ్బంది బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించి 3,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పెద్దిపాలెంలో 1,000 లీటర్లు, బవురువాకలో 1,900 లీటర్లు, ధారపల్లిలో 700 లీటర్లు ధ్వంసం చేసినట్టు ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ బి.శివప్రసాద్ తెలిపారు. దాడుల్లో కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కేవీ స్వామి, ప్రత్తిపాడు ఎస్ఐ బి.వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చియ్యపేటలో 1,200 లీటర్లు

తొండంగి/తుని రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం బుచ్చియ్యపేట గ్రామంలో సారా తయారీ కేంద్రంపై తుని ఎక్సైజ్ ఎస్ఐ శాస్త్రి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. 1,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ వై.పట్టాభిచౌదరి తెలిపారు.

జేఎన్టీయూకే బాస్కెట్‌బాల్ విమెన్ టీమ్‌కు 'ఆదిత్య' విద్యార్థినుల ఎంపిక

గండేపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య టెక్నాలజీ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జేఎన్టీయూకే బాస్కెట్‌బాల్ విమెన్ టీమ్‌కు ఎంపికైనట్టు యూనివర్శిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ నెల 20 నుంచి 24 తేదీ వరకు కొట్టాయంలోని మహాత్మాగాంధీ యూనివర్శిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ టోర్నమెంట్‌లో మాధవి, విజయదుర్గ పాల్గొంటారన్నారు. విద్యార్థినులను వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి అభినందిస్తూ రూ.5వేలు నగదు బహుమతి అందించారు.


విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

తుని రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య పేర్కొన్నారు. మండలంలోని వల్లూరులో తహసీల్దారు ప్రసాద్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, టీడీపీ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), కోడా వెంకటరమణ, కుర్రా వెంకటరమణ పాల్గొన్నారు.


రైతు నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దివ్య

చిరుజల్లులతో రైతుల్లో ఆందోళన

రౌతులపూడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో చిరుజల్లులు పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బలరామపురం, రాజవరం, రౌతులపూడి, మూలగపూడి తదితర గ్రామాల్లో ఇప్పటికే కోతలు కోశారు. కొన్నిచోట్ల చేలు కోతలకు సిద్ధంగా వున్నాయి. కోసిన చేలను ఇంకా ఒబ్బిడి చేసుకోలేదని వర్షం పడితే సర్వనాశనం అవుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): మండలంలో వారం నుంచీ కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. బుధవారం కురిసిన వర్షంతో పంట నానిపోయింది. రైతులు కోసిన వరి పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో వున్నారు. కూలీలు దొరక్క నానా ఇబ్బందులుపడ్డారు. కూలీలకు అధికంగా సొమ్ము చెల్లించి పనులు చేయించుకుంటున్నారు.

శంఖవరం (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా ఈ వారంలో వర్ష సూచన ఉందని, రైతులు వరికోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారి పి.గాంధీ కోరారు. ఇప్పటికే కోతలు కోసిన వారు కుప్పలు వేసుకుని భద్రపరుచుకోవాలని బుధవారం ఆయన స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటకు భీమా చేసుకోవాలని, ఈ నెల 31 వరకు గడువు ఉందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఉద్యానవన సహాయకురాలు హిమబిందు, రైతులు పాల్గొన్నారు.


కోటనందూరు మండలం జగన్నాథపురంలో తడిసిన వరి పనలు

గ్రావెల్ ట్రాక్టర్ల అడ్డగింత

రౌతులపూడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి శివారు ఏలేరు కాలువ సమీపంలోని ఓ రైతు పొలం నుంచి గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం పెద్దాపురం మరిడమ్మ తల్లి చెట్టు వద్ద మైనింగ్ చెక్‌పోస్టు సిబ్బంది అడ్డుకున్నారు. సుమారు ఎనిమిది ట్రాక్టర్లను సుమారు గంటసేపు నిలిపివేసి మైనింగ్ చెల్లించాలని పట్టుబట్టారు. పేదల ఇళ్ల నిర్మాణంలో భాగంగా పునాదుల్లో నింపేందుకు గ్రావెల్ తరలిస్తున్నామని ట్రాక్టర్ల యజమానులు తెలిపినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ దృష్టికి తీసుకెళ్లగా అడ్డుకోవద్దని చెప్పడంతో వదిలేసినట్టు ట్రాక్టర్ల యాజమానులు తెలిపారు.


మైనింగ్ చెక్‌పోస్టు సిబ్బంది అడ్డుకున్న ట్రాక్టర్లు

సైబర్ నేరాలు, మోసాలపై అవగాహన

జగ్గంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక దేవీ ఫిషరీస్ యూనిట్‌లో సీఐ వైఆర్కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం మహిళా రక్షక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు మహిళలు, ఒడిశా యువతులకు సైబర్ నేరాలు, మోసాల గురించి వివరించారు. యువత మత్తు పదార్థాలు, మత్తు పానీయాలకు బానిసలు కాకుండా చూడాలన్నారు. ఒడిశా యువతులు అభద్రతాభావానికి లోనుకావాల్సిన అవసరం లేదని, వారికి రక్షణగా ఉంటామని స్పష్టం చేశారు. ఎటువంటి వేధింపులున్నా 100, 94407 96529 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. సదస్సులో జగ్గంపేట ఎస్ఐ రఘునందనరావు, గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు, దేవీ ఫిషరీస్ ప్రతినిధులు ఆకాష్, సురేష్, కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం

ప్రత్తిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన 14ఏళ్ల బాలుడు తూరంగి అరవింద్ అదృశ్యమైనట్టు సీఐ బి.సూర్య అప్పారావు బుధవారం తెలిపారు. ఈ నెల 12న ఇంట్లో మందలించారని అరవింద్ అలిగి వెళ్లిపోయాడన్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు ప్రత్తిపాడు సీఐ, ఎస్‌లకు 94407 96530, 94407 96570 నెంబర్లలో తెలియజేయాలన్నారు.


అరవింద్ (పాత చిత్రం)



మంత్రి పేరు లేకుండా...

తొండంగి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తొండంగిలో మంగళవారం సిమెంటు రోడ్డు ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే యనమల దివ్య ఆవిష్కరించిన శిలాఫలకం సోషల్ మీడియాలో చర్చకు తెరలేపింది. దానిపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ పేరు లేకపోగా పార్టీ పదవులు ఉన్న వారి పేర్లు వేయడాన్ని పలువురు తప్పుపట్టారు. ప్రొటోకాల్ ప్రకారం ఎంపీ పేరు మొదట వేయాల్సి వున్నా ఆ విధంగా లేదు. అధికారుల తప్పిదం కారణంగానే ఇలా జరిగిందన్న వ్యాఖ్యలు వినిపించాయి. ఇదిలా వుండగా విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే ఆ శిలాఫలకాన్ని వస్త్రంతో కప్పేశారు.




ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ అమ్మవారు

దుర్గమ్మ తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

గండేపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారి తిరునాళ్లు రెండో రోజుకు చేరుకున్నాయి. స్థానికులతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వాహనాల్లో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కుటుంబీకులతో ఆనందంగా గడిపారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శివనాగబాబు చర్యలు చేపట్టారు.

ప్రొఫెసర్ సుధారాణికి డాక్టరేట్



గండేపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న టి.సుధారాణికి జేఎన్టీయూకే డాక్టరేట్ ప్రదానం చేసిందని ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 'మెషిన్ లెర్నింగ్ ఆఫ్ బెస్ట్ మెథడ్స్ ఫర్ ప్రోటీన్ సీడ్ ప్లాంట్స్ క్లారిఫికేషన్ అండ్ స్ట్రక్చర్ ప్రిడిక్షన్' అంశంపై సమర్పించిన థీసిస్‌కు సుధారాణికి డాక్టరేట్ లభించింది. ఆమెను యూనివర్శిటీ అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, వైస్ చాన్సలర్ సతీష్‌రెడ్డి అభినందించారు.

నేడు ఎ.కొత్తపల్లిలో రెవెన్యూ సదస్సు

తొండంగి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎ.కొత్తపల్లి గ్రామంలో గురువారం జరిగే రెవెన్యూ సదస్సుకు తుని ఎమ్మెల్యే యనమల దివ్య హాజరువుతారని టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కొయ్యా రామకేశవ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే సదస్సుకు రైతులు హాజరై సమస్యలకు పరిష్కారం పొందాలని ఆయన కోరారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు అడ్డుకట్ట

జగ్గంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రజ్ఞ విద్యా సంస్థల ఆవరణలో చైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో 400 మంది విద్యార్థులకు రాజపూడి పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ రక్త పరీక్షలు, కంటిచూపు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం పెట్టడం ద్వారా రక్తహీనతను అరికట్టవచ్చన్నారు. రాజేశ్వరి రామకృష్ణన్ కంటి ఆసుపత్రి డాక్టర్ దయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆకు కూరలు తినిపించడం వల్ల దృష్టి లోపాలను తొలగించవచ్చన్నారు. శ్రీప్రజ్ఞ విద్యా సంస్థల డైరెక్టర్లు మట్టే శ్రీనివాస్, బండారు శ్వేత, రాజపూడి పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఉమామహేశ్వరరావు, డి.శ్రీనివాస్, కమలకుమారి, ప్రిన్సిపాల్ కె.అభి, హెచ్ఎం సోఫియా, కొల్లా శ్రీనివాస్, పులిగ పవన్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులను పరీక్షిస్తున్న వైద్యురాలు

వినోద్ మిశ్రా సిద్ధాంతాలు స్ఫూర్తిదాయకం

ప్రత్తిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మానవ విముక్తికి సామాజిక పరివర్తన మార్గమని, వినోద్ మిశ్రా సిద్ధాంతాలు స్ఫూర్తిదాయకం, ఆచరణీయమని సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రావు పేర్కొన్నారు. వినోద్ మిశ్రా వర్ధంతి సందర్భంగా మండలంలోని చింతలూరులో బుధవారం ఆయన చిత్రపటానికి లిబరేషన్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానుకొండ లచ్చబాబు, గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, తాడి నాగేశ్వరరావు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు వి.కామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): స్థానిక వినోద్ మిశ్రా నగర్‌లో సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం వినోద్ మిశ్రా వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఆర్గనైజింగ్ సెక్రటరీ కొసిరెడ్డి గణేష్ పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. వినోద్ మిశ్రా నగర్ నుంచి ర్యాలీగా బాలాజీ చౌక్‌కు చేరుకున్నారు. నాగులపల్లి అర్జునుడు, సోమల కుశల, మాడెం బాబూరావు, గుమ్మడి రాజేష్, వడ్డాది గంగ, మసరపు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో వినోద్ మిశ్రా వర్ధంతిని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సామిరెడ్డి నారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రావు వినోద్ మిశ్రా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెరూరి లక్ష్మి, ఆవాల నారాయణమూర్తి, బోడియ్య, ఉండవల్లి చినతల్లి పాల్గొన్నారు.


ప్రత్తిపాడు మండలం చింతలూరులో మాట్లాడుతున్న బంగార్రావు


ఏలేశ్వరంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

'గిడజాం కొండపై ఎటువంటి నిర్మాణాలొద్దు'

రౌతులపూడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ అనుమతి లేకుండా కొండపై ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు పేర్కొన్నారు. కొండపై శిలువ ప్రతిష్ఠించడంపై బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం గిడజాంలో సీఐ అప్పారావు, తహసీల్దారు పోతురాజు, ఎస్ఐ వెంకటేశ్వరరావు పర్యటించారు. శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా క్రైస్తవులు, హిందువులు కొండపై ఎటువంటి నిర్మాణాలు చేయకూడదన్నారు.

'పొలం పిలుస్తోంది'

గండేపల్లి, డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని నాయకంపల్లిలో బుధవారం వ్యవసాయ శాఖ ఏవో సద్గురుమూర్తి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 పంట నమోదు కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ప్రధానమంత్రి పసల్ భీమా యోజనకు ఆధార్, పట్టాదారు, బ్యాంక్ పాస్ బుక్‌లతో దగ్గర్లోని కస్టమర్ సర్వీస్ సెంటర్లో నమోదు చేసుకోవాలన్నారు. సిబ్బంది చంద్రమౌళి, జాన్, రైతులు పాల్గొన్నారు.